

రెండు రోజుల్లో ఇంటికి వస్తానంటివే...

● ఇంతలోనే వెళ్లిపోయావా నాయనా...

● తల్లిదండ్రుల రోదన ● రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి





రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో శోకసంద్రంలో తల్లిదండ్రులు, (ఇన్‌సెట్లో) మహేంద్ర నాయక్ (ఫైల్)

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమ్మ నేను రెండు రోజుల్లో ఇంటికి వస్తానన్న తమ కొడుకు కానరాని లోకాలకు వెళ్లిపోయాడని... సంవత్సరంలో కోర్సు పూర్తి చేసుకుని మిమ్మల్ని జాగ్రత్త చూసుకుంటానని చెప్పి ఇలా మోసం చేస్తావని అనుకోలేదు బిడ్డా అంటూ ఆ తల్లిదండ్రుల రోదిస్తుండడం చూసిన వారందరూ కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వివరాల మేరకు... అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గం నల్లమడతాండాకు చెందిన తులసీధర్, తిరుపాల్‌బాయి దంపతుల కుమారుడు మహేంద్ర నాయక్ (21) తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీలో అనస్థీషియా కోర్సు రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఏపీ39 జీయు 2047 రాయల్ ఎన్ఫీల్డ్ బైకులో కోడూరుకు వస్తుండగా శెట్టిగుంట పంచాయతీ కడప-చెన్నై ప్రధాన రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మహేంద్రనాయక్ మృతి వార్త తెలియగానే తోటి విద్యార్థులు తిరుపతి నుంచి కోడూరుకు చేరుకుని మృతదేహాన్ని చేసి శోకసంద్రంలో మునిగిపోయారు.

వీరభద్రుడి హుండీ ఆదాయం

● రూ.45.23 లక్షలు



వీరభద్రాలయంలో హుండీల సొమ్మును లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో గల హుండీల ద్వారా రూ.45.23 లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు దేవదాయశాఖ జిల్లా కార్యాలయ జూనియర్ సహాయకుడు ఎం.రవికుమార్ పర్యవేక్షణలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏడాది జూన్ 28 నుంచి ఈనెల 16వ తేదీ వరకు అనగా 171 రోజులకు వీరభద్రస్వామి వారి హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ.32 లక్షల 32 వేల 013లు కాగా, అమ్మవారి హుండీ ద్వారా వచ్చి ఆదాయం రూ.6 లక్షల 39 వేల 438, విఘ్నేశ్వరస్వామి హుండీ ద్వారా వచ్చిన ఆదాయం రూ.2 లక్షల 16 వేల 230, అఘోర లింగేశ్వర స్వామి హుండీ ద్వారా రూ.లక్షా 62 వేల 710 వచ్చింది. కాగా సుబ్రమణ్య స్వామి, కాలభైరవస్వామి, నవగ్రహ మండపం హుండీల ద్వారా వచ్చిన ఆదాయం రూ.62 వేల 230లతో కలిసి మొత్తం రూ.43 లక్షల 12 వేల 621లను రాయచోటిలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో వీరభద్రస్వామి దేవస్థానం పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు ఆలయ ఈవో రమణారెడ్డి తెలిపారు. అలాగే అన్నదానం హుండీ ద్వారా వచ్చిన ఆదాయం రూ.2 లక్షల 10 వేల 920లను రాయచోటి స్టేట్ బ్యాంక్‌లోని అన్నదానం అకౌంట్‌లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే హుండీల లెక్కింపులో భాగంగా బంగారు 47 గ్రాములతో పాటు 4 కేజీల 300 గ్రాముల వెండి నగలు వచ్చాయన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పవిత్ర, సిబ్బందితో పాటు రాయచోటి గ్రామ వీఆర్వో గంగాధర్, ఏఎస్ఐ శివబాబానాయక్, హెడ్ కానిస్టేబుల్ రఘునాధ, పోలీసు సిబ్బంది, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

బహు సుందరం.. ఈ తామర పత్రం 6



మూడేళ్లుగా అనాథగా మారిన అన్నమయ్య ప్రాజెక్టు



అయ్యో... అన్నమయ్య...!

● అన్నం పెట్టే ప్రాజెక్టుకు నిధులు లేవంటే ఎలా...?

● వైసీపీ పాలనలో రూ.800 కోట్లతో పునరుద్ధరణ అంటూ మాయమాటలు

● ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తున్నా అతీ గతీ లేదు..

● 22,500 ఎకరాల ఆయకట్టులో ఇక సాగు లేనట్లే...

రాజంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై ఆశలు వదులుకున్నట్లే కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు తెగిపోవడానికి ప్రధాన కారకులు గత ప్రభుత్వ వైసీపీ పెద్దలే అన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రతి ఏడాది రెండు మండలాల ప్రజలకు సాగు, తాగునీరిచ్చి అన్నం పెట్టే అన్నదాత లాంటి అన్నమయ్య ప్రాజెక్టును దిగువ ప్రాంతంలో ఇసుక కోసం గేట్లు ఎత్తకుండా నీటిని అలాగే ఉంచడంతో భారీ వరద నీరు వల్ల ప్రాజెక్టు తెగిపోయిన విషయం అందరికీ తెలిసిందే. ఆ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా ఊర్లకు ఊర్లే కొట్టుకుపోయాయి. అయితే జగన్ ప్రభుత్వం ఈ సంఘటనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సంబంధిత ఏ ఒక్క అధికారిపై కూడా కనీసం చర్యలు తీసుకోలేదు. అయితే అధికారులపై చర్యలు తీసుకుంటే తమ తప్పు బయటపడి మొత్తం ప్రభుత్వానికి ఈ అపవాదు చుట్టుకుంటుందని ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా అన్నమయ్య ప్రాజెక్టు దుర్ఘటనపై ఎటువంటి వైఖరి వెల్లడించలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే దీనిపై పూర్తి స్థాయి విచారణ చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కూటమి నేతలు చెప్పినా ఆరు నెలలవుతున్నా దీనిపై అతీ గతీ లేదు. మామూలుగా ఓ చిన్నరోడ్డు ప్రమాదం జరిగినా లేదా ఓ చిన్న భూఆక్రమణ జరిగినా ఓ చిన్నపాటి ప్రాణనష్టం జరిగినా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. అటువంటిది ఇంత దుర్ఘటన జరిగితే కూటమి ప్రభుత్వం కూడా దీనిపై చర్యలకు ఉపక్రమించలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలపై కూటమి ప్రభుత్వం ఇప్పుడు చర్యలు తీసుకుంటోంది. ఆ క్రమంలోనైనా ఇంత తీవ్ర దుర్ఘటన జరిగిన అన్నమయ్య వ్యవహారంపై చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రాజెక్టు తెగిపోయినప్పుడు ఉన్న ప్రధాన అధికారే నేటికీ కొనసాగుతుండడం విశేషం.

ప్రాజెక్టు పునర్నిర్మాణం ఇక అంతే...

ప్రాజెక్టు పునర్నిర్మాణంపై ఎవరూ నమ్మకం పెట్టుకోవడం లేదు. ఎందుకంటే కేవలం 2.25 టీఎంసీలు అంటే మూడు పెద్ద చెరువులను పోలిన చిన్న ప్రాజెక్టుకు ఏకంగా రూ.800 కోట్లు విడుదల చేస్తున్నామని, మొదట రూ.720 కోట్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు వైసీపీ ప్రభుత్వం ఎన్నెన్నో ప్రకటనలు గుప్పించినా ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. ఇది పక్కా జగన్ ప్రభుత్వ బోగస్ హామీ. కొందరు నిపుణులు చెబుతున్నట్లు ఈ ప్రాజెక్టు తిరిగి టెండర్ల పేరిట కాంట్రాక్టర్ల నుంచి భారీ ముడుపులు తీసుకోవడానికి ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులే ఈ తతంగం నడిపినట్లు ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాజెక్టుపై స్పష్టమైన వైఖరిని ఇంతవరకు వెల్లడించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ప్రాజెక్టు కట్టక ముందు దిగువ ప్రాంతాల్లోని మూడు మండలాలైన రాజంపేట, నందలూరు, పెనగలూరు పరిధిలోని సుమారు 50 గ్రామాలకు ఏడాది పొడవునా పుష్కలంగా తాగు, సాగునీరు అంది కోనసీమగా ఉండేది. ప్రాజెక్టు కట్టిన తర్వాత దిగువ ప్రాంతాలకు చుక్కనీరు రాక ఎడారిగా మారిపోయింది. ప్రాజెక్టు కట్టే సమయంలో ఈ చెయ్యేరు నది పుట్టినప్పటి నుంచి నీరు అందే ప్రాంతాలను ఎండగట్టి ఎగువ ప్రాంతాలకే నీరు ఇవ్వాలనుకోవడమే పెద్ద పొరపాటు. కావున ఈ సమయంలో ఇటువంటి పొరపాట్లు జరగకుండా ఎగువ, దిగువ ప్రాంతాలకు న్యాయం జరిగేటట్లు ప్రాజెక్టు పునర్నిర్మించాలని దిగువ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం స్పందించేనా!

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వమైనా అన్నమయ్య ప్రాజెక్టు అంశంపై స్పష్టత ఇవ్వాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. అసలు ప్రాజెక్టు కడతారా? కట్టరా? కడితే ఎగువ, దిగువ ప్రాంతాలకు న్యాయం జరిగేటట్లు ప్రాజెక్టు నిర్మిస్తారా... ఇంత భారీ వ్యయంతో ప్రాజెక్టును పునర్నిర్మిస్తారా అసలు ఈ ప్రాజెక్టు కట్టడానికి ఈ ప్రాంతం అనువైనదేనా.. అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఎందుకంటే ఇప్పటికే ప్రాజెక్టు తెగిపోవడం వల్ల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని 22,500 ఎకరాల ఆయకట్టు భూమికి చుక్కనీరు అందే పరిస్థితి లేదు. దీనివల్ల మూడేళ్లుగా ఈ భూములన్నీ బీళ్లుగా ఉన్నాయి. పుల్లంపేట, రాజంపేట మండలాల పరిధిలోని అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతంలోని హస్తవరం, మన్నూరు, చెర్లోపల్లె, క్రిష్టమ్మ చెరువు, ఊటుకూరు లాంటి ఏడు చెరువులు ఉన్నాయి. ఇవన్నీ చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. ఈ స్థితిలో ఈ ప్రాజెక్టు పునర్నిర్మించకపోతే ఈ భూములు పండక రైతులు వలసపోవాల్సిందే. దీనిపై ఇప్పటికే జలవనరులశాఖ ప్రాజెక్టు పునర్నిర్మాణమా, లేక ప్రత్యామ్నాయ అంశాలపై లోతైన చర్చ జరిపింది. ఒకవేళ ప్రాజెక్టు నిర్మించకపోతే చెయ్యేరు నదిలో చెక్‌డ్యాంలు ఏర్పాటు చేసి లిఫ్టు ఇరిగేషన్ పథకం ద్వారా చెయ్యేరు వరద నీటిని పంపింగ్ చేసి ఆయకట్టుకు నీరందించే అవకాశాలు చాలా సులభం అంటున్నారు. ఇదే విషయమై ఇటీవల భారీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును బీజేపీ నేతలు కలిసి ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మించేవరకైనా వరద నీటిని పంపింగ్ స్కీముల ద్వారా అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు ప్రస్తుతం ఉన్న కాలువ ద్వారా పంపితే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని విన్నవించారు. దీని సాధ్యాసాధ్యాలపై నిపుణుల కమిటీని వేసి చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. స్థానిక ప్రజా ప్రతినిధులందరూ దీనిపై స్పందించి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుని అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు రైతులను ఆదుకోవాలని, ప్రాజెక్టు పునర్నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని, ఈ ప్రాంతం రైతాంగం వేడుకుంటోంది. ఈ విషయమై అన్నమయ్య ప్రాజెక్టు అధికారులను వివరణ కోసం ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా వారు ఎవరూ అందుబాటులోకి రాలేదు.

ప్రత్యేక పంపింగ్‌ల ద్వారా తక్షణం నీరందించాలి

-నాగోతు రమేష్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, రాజంపేట



ప్రస్తుతం వర్షాల వల్ల వరద నీటితో చెయ్యేరు కళకళలాడుతోంది. ఈ నీరంతా దిగువ ప్రాంతాలకు వృథాగా పోతోంది ప్రాజెక్టు పునర్నిర్మించడానికి చాలా సమయం పడుతుంది. అంతవరకు నదిలో ప్రత్యేక పంపింగ్ స్కీములను ఏర్పాటు చేసి ప్రస్తుతం ఉన్న అన్నమయ్య కాలువ ద్వారా చెరువులకు, ఆయకట్టు ప్రాంతానికి నీరందించవచ్చు. దీనిపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వివరించి వినతి పత్రం అందజేశాం. ప్రభుత్వం దీనిపై వెంటనే స్పందించాలి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే మేమంతా వలస పోవాల్సిందే

- మేకా రమణయ్యనాయుడు, ఆయకట్టు రైతు, మేకావారిపల్లె




అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు పంపింగ్ స్కీంలు ఏర్పాటు చేసి లిఫ్టు ఇరిగేషన్ పథకాల ద్వారానైనా ఏదో ఒక మార్గం ద్వారా నీరందించకపోతే మేమంతా వలసపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఆయకట్టు రైతులను ఆదుకోవాలి. రాజంపేట, పుల్లంపేట మండలాల పరిధిలోని కూచివారిపల్లె, బ్రాహ్మణపల్లె, మేకవారిపల్లె, మిట్టమీదపల్లె, చుండువారిపల్లె, హస్తవరం, చెర్లోపల్లె, బావికాడపల్లె, వత్తలూరు చుట్టుపక్కల 22,500 ఎకరాల ఆయకట్టు భూమి చుక్కనీరు లేక బీడుగా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ప్రాంత రైతులు ఎవరూ ఉండలేరు.

కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించాలి

- రామ నరసింహులు, అన్నమయ్య ఆయకట్టు రైతు, మాజీ మండల ఉపాధ్యక్షులు, కూచివారిపల్లె.



కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే అన్నమయ్య ఆయకట్టు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. మూడేళ్లుగా ఆయకట్టు చుక్కనీరు లేక ముళ్లచెట్లమయమై బీళ్లుగా మారిపోయాయి. ఈ స్థితిలో ప్రతి ఒక్కరూ ప్రధానంగా ప్రజాప్రతినిధులు స్పందించాల్సి ఉంది. ఈ ప్రాంత అన్నమయ్య ఆయకట్టు రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం ప్రధానంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ఈ ప్రాంత రైతాంగం ఎంతో నమ్మకంతో ఉంది. ముఖ్యమంత్రి వెంటనే ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలి.



నీరు లేక బీడుగా ఉన్న ఆయకట్టు భూమి, ప్రాజెక్టు తెగిపోవడంతో అలంకారప్రాయంగా అన్నమయ్య కాలువ, చుక్కనీరు లేక వెలవెలబోతున్న అన్నమయ్య ప్రాజెక్టు స్పిల్‌వే ప్రాంతం

భూసమస్యల్లో అన్నమయ్య జిల్లా టాప్

● గత ఐదేళ్ల వైసీపీ పాపాలే కారణం

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రెవెన్యూ భూసమస్యల్లో అన్నమయ్య జిల్లా మొదటిస్థానంలో ఉందని వైసీపీ పాలనలో జరిగిన పాపాలే ఇందుకు కారణమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రెవెన్యూ సదస్సులో భాగంగా గుట్టపల్లి, ఎస్.సోమవరం, శెట్టిపల్లె గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంబేపల్లె మండలంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాలు గుట్టపల్లి, ఎస్.సోమవరం, శెట్టిపల్లె అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా భూఆక్రమణలు, 22ఏ భూముల అక్రమాలతో పాటు పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌లైన్ చేయడంతో పాటు 45 రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు తక్షణమే పరిష్కరించి రెవెన్యూ సదస్సులపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భూబాధితులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా భూసమస్యల పరిష్కారం కొరకే చంద్రబాబు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారన్నారు. వైసీపీలో తప్పులు చేసిన వారికి టీడీపీ నాయకులు వత్తాసు పలకడం మంచి పద్ధతి కాదని, అందుకు ఈ ఫొటోలే నిదర్శనం అని సమావేశంలో చూపించారు. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తల కోసం ముందుంటానన్నారు. శెట్టిపల్లి గ్రామానికి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు మల్లు నరసారెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి బోర్లు వేయాలని అధికారులకు సూచించారు. సిమెంటు రోడ్లకు ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామన్నారు. శెట్టిపల్లె హైస్కూల్‌కు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వెంకటరత్నం, తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీవో రామచంద్ర, బాలయ్యగారిపల్లె సర్పంచ్ విశ్వనాధనాయుడు, మాజీసర్పంచులు ప్రభాకర్‌నాయుడు, శశిధర్‌రెడ్డి, గోపాల్, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, వేణుగోపాల్ నాయుడు, ఎంపీటీసీ రామరాజు, టీడీపీ నాయకులు మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, ఖాదర్‌బాషా, ప్రతాప్‌రెడ్డి, రెడ్డెయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, అఖండ జయరాంనాయక్, రమేశ్‌యాదవ్, భయ్యారెడ్డి, మాధవయ్యనాయుడు, యువగళం సిద్దారెడ్డి, మెకానిక్ రెడ్డెప్ప, రాళ్లపల్లి రమేశ్‌నాయుడు, శేఖర్ నాయుడు, శేఖర్‌రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



శెట్టిపల్లె రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలి

● క్షేత్రస్థాయిలో కచ్చితమైన సమాచారాన్ని అందజేయాలి

● స్పెషల్‌బ్రాంచ్ సిబ్బంది సమీక్షలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ బ్రాంచ్ విభాగం సిబ్బంది తమకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీసు సమావేశ మందిరంలో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కచ్చితమైన సమాచారం వచ్చేలా సమాచార వ్యవస్థను పటిష్టంగా చేసుకోవాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసు సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు, సలహాలు చేశారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌లు రాజారమేశ్, సత్యనారాయణ, రాజారెడ్డి, ఎస్ఐలు, జిల్లాలోని ఎస్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.



స్పెషల్ బ్రాంచి సిబ్బంది సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

ఐదు నెలలుగా జీతాలు రాక... 6
● కుదేలవుతున్న జీవితాలు ● ఆవేదనలో ఆయాలు, వాచ్‌మెన్‌లు

వైభవంగా సీతారాముల కల్యాణం 6

బహు సుందరం.. ఈ తామర పత్రం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక సినిమాల్లో తరచూ మనం చూస్తుంటాం. తామర పువ్వు, తామర ఆకులపై దేవతామూర్తులు దర్శనమిస్తుంటారు. వాటిని చూసి ఎంతో ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలుగుతుంది. అయితే అది కేవలం సినిమా జిమ్మిక్స్ అని చెప్పాలి. అయితే కడప యోగివేమన యూనివర్సిటీలో అటువంటి తామరపత్రం దర్శనమిచ్చింది. ఈ తామరపత్రంపై 36 కేజీల బరువున్న అమ్మాయి కూర్చున్నా సరే.. ఆ పత్రానికి ఎటువంటి నష్టం కలగలేదు. ఈ మొక్కను జెయింట్ వాటర్ లిల్లీ అని పిలుస్తారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద తామర మొక్క అని చెబుతున్నారు. యోగవేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌లో 2019 జూలైలో పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా సుభాష్ చంద్రబోస్ బొటానికల్ గార్డెన్ నుంచి ఈ మొక్కను తీసుకువచ్చి నాటారు. ఈ మొక్క ఒక్కొక్కటిగా ఎదుగుతూ ప్రస్తుతం కొలనును పూర్తిగా ఆక్రమించుకుంది. ఈ కలువలతో కొలను ఎంతో సుందరంగా దర్శనిమిస్తోంది. ఇది సువాసన వెదజల్లడంతో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.





జెయింట్ లిల్లీ ఆకుపై కూర్చున్న విద్యార్థిని, అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ మధుసూదనరెడ్డి

చరిత్ర తెలుసుకుందాం...

విక్టోరియా అమెజానిక ప్రపంచంలోనే అతిపెద్ద నీటి కలువ ఈ మొక్క. అమెజాన్ నదీ పరివాహక ప్రాంతానికి చెందినది. ప్రధానంగా ఉష్ణమండల దక్షిణ అమెరికాలో పెరుగుతుంది. ఇది గయానా జాతీయ పుష్పం. విక్టోరియా అమెజానిక చాలా పెద్ద ఆకులు కలిగి ఉంటుంది. నీటి ఉపరితలంపై ఐదు నుంచి ఎనిమిది మీటర్ల పొడవుతో నీటిలో ఉన్న కొమ్మపై తేలుతూ ఉంటుంది. పువ్వులు ఉదయం తెల్లగా ఉంటాయి.

అదేరోజు సాయంత్రానికి గులాబీ లేదా ఊదా రంగులోకి మారుతుంటాయి. పువ్వులు అతిపెద్దవి 12 అంగుళాల వ్యాసం కలిగి ఉంటాయి. వీటి ఆకులు మూడు



మీటర్ల వరకు వ్యాసం కలిగి ఉంటాయి. తామరాకు 40 కేజీల వరకు బరువును మోస్తాయని వైవీయూ బాటనీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.మధుసూదనరెడ్డి తెలిపారు.

బాటనీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం

కడప నగరం యోగివేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌లో ఉన్న జెయింట్ వాటర్ లిల్లీ మొక్కను ప్రతి ఒక్కరూ చూడాల్సిందే. ఇది బాటనీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. ఈ మొక్కతో పాటు ఇంకా అనేక రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వాటిపై విద్యార్థులు అధ్యయనం చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. ఈ అరుదైన మొక్కను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు వచ్చి ప్రత్యక్షంగా పరిశీలించి వెళ్తుంటారు.

10 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



సిద్దవటం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టక్కోలి సమీపంలో ఉన్న పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో టక్కోలి వద్ద పెన్నానదిలో మంగళవారం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కడపకు ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఆర్ఐ ప్రసాద్, స్థానిక పోలీసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రాజంపేటలో చైన్ స్నాచర్ల హల్‌చల్

రాజంపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోయనపల్లెలో మంగళవారం చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో వెళుతున్న ఓ మహిళ చైను కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. బోయనపల్లె ప్రధాన రహదారిపై వెళుతున్న మరో మహిళపై దాడి చేసి నాలుగు తులాల బంగారు చైనును దొంగలించుకుని పరారయ్యాడు. ఒక్క రోజులోనే వేర్వేరు చోట్ల చైన్ స్నాచర్లు తెగబడడంతో పట్టణవాసులు ఆందోళనకు గురవుతున్నారు..

ఇసుక డంపు సీజ్

గుర్రంకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురులు అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును పోలీస్, రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. 'ఈ ఇసుక డంపులు ఎవరివి' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసులు తరిగొండ రామానాయునిచెరువు పరిసరాల్లో ఇసుక డంపు లను గుర్తించారు. ఇందులో భాగంగా రుద్రవారిపల్లె సమీపంలోని రైతుల పొలాల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును సీజ్ చేశారు. ఈ ఇసుక డంపులో సగానికిపైగా ఇసుకను రాత్రికి రాత్రే తరలించేశారు. అలాగే పక్కనున్న మరో ఇసుక డంపులో పూర్తిగా ఇసుకను ఖాళీ చేశారు. దీంతో నాలుగు ట్రాక్టర్ లోడ్ల ఇసుక డంపును అధికారులు సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కాగా పోలీసులు, రెవెన్యూ అధికారులు వస్తు న్నట్లు తెలుసుకున్న ఇసుకాసురులు చెరువులో ఇసుక నింపుతున్న ట్రాక్టర్లతో సహా పరారయ్యారు. కార్యక్రమంలో వీఆర్వో నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక డంపును సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

ఆకతాయిల ఆటలు కట్టిస్తాం.. సీఐ

● బాలికల గురుకుల కళాశాలలో పోలీసుల తనిఖీలు

వాల్మీకిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని తరిగొండ రోడ్డులో గల ఏపీ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలి యని ఆకతాయిలు హల్‌చల్ చేసి కళాశాలలోని బాలికలను బెదిరింపులకు గురిచేశారన్న విషయమై కళాశాల ప్రిన్సిపాల్ రామాంజుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మంగళవారం స్థానిక సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌లు కళాశాలలో విస్తృత తనిఖీ లు చేపట్టారు. స్థానిక స్థితిగతులను పరిశీలిస్తూ బాలికల భద్రత విషయమై వివరాలను ఆరా తీశారు. ఈసందర్భంగా సీఐ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కళాశాలలో అర్ధరాత్రి బాలి కలను భయభ్రాంతులకు గురిచేసిన ఆకతాయిల విషయమై నిఘా పెట్టామన్నారు. ఇకపై నిత్యం గురుకుల కళాశాల, హైస్కూల్ ప్రాంతంలో పోలీసుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్లపై శృతిమించి ద్విచక్రవాహనాలు నడపడం, ఈవ్ టీజింగ్ లాంటి వాటిపై ప్రత్యే నిఘా పెట్టామని, పట్టుబడితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



గురుకుల కళాశాలలో తనిఖీ చేస్తున్న సీఐ ప్రసాద్‌బాబు

మాకు తెలుసు.. మేం చూపిస్తాం.. పో!

● దళితులపై డిప్యూటీ తహసీల్దారు ఆగ్రహం

● శ్మశానానికి దారి కోసం కార్యాలయం ఎదుట నిరసన


పుల్లంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్మశానానికి స్థలం చూపారు. కానీ , అక్కడికి వెళ్లేందుకు దారి చూపాలని, రెండేళ్లుగా ఈ సమస్యపై తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని చొప్పావారిపల్లెకు చెందిన దళితులు కోరగా, మాకు తెలుసు.. మేం చూపిస్తాం..పో.. అంటూ డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కొమ్మనవారిపల్లెలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ దృశ్యం కనిపించింది. దీంతో అవాక్కైన ఫిర్యాదుదారులు ఇదేమిటని ఆమెను ప్రశ్నించగా, మీరు కలెక్టర్‌తో మాట్లాడుతారా, జేసీతో మాట్లాడుతారా చెప్పండి. ఇప్పుడే ఫోన్ చేస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేయగా.. షటప్ అంటూ రెచ్చిపోయారు. అర్జీ ఇచ్చారు.. మిగతాది మేము చూసుకుంటాం. ఎక్కువ మాట్లాడితే పోలీసులను పిలిపిస్తా అంటూ ఫిర్యాదుదారులను భయపెట్టారు. దీంతో దళితులు తమకు న్యాయం చేయాలంటూ నిరసన తెలియజేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దారు ఎస్ఐకి ఫోన్ చేసి గ్రామస్తులపై ఫిర్యాదు చేశారు. పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ రెవెన్యూ సదస్సుకు చేరుకుని విచారణ చేశారు.



సచివాలయం ముందు నిరసన తెలియజేస్తున్న దృశ్యం

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

బి.కొత్తకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరి జనార్దన్, విజయనిర్మల (34) భార్యాభర్తలు. విజయనిర్మల పుట్టినిల్లు పీటీఎం మండలంలోని పులికల్లు. వారికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. జనార్దన్ లారీడ్రైవర్ కాగా, విజయనిర్మల మదనపల్లెలోని ఓ గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. ఇటీవలి కాలంలో వారి మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో విజయనిర్మల మంగళవారం తెల్లవారుఝామున ఇంట్లోనే శవమై కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగాధర్‌బాబు తెలిపారు.



సకాలంలో రుణాలు చెల్లించండి

ఏపీజీబీ రీజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ స్వారో

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాం కు నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని రాజంపేట డివిజను రీజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ స్వారో తెలిపారు. మంగళవారం మండలంలోని చెంచయ్యగారిపల్లె, లింగందిన్నెపల్లె, బ్రహ్మంగారిమఠం, మల్లేపల్లె గ్రామాల్లో బ్యాంకుకు అప్పు ఉన్న ఖాతాదారుల వద్దకు రికవరీ కోసం వెళ్లారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజరు మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యాంకు నుంచి రూ.8.90 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఈ ప్రజలు ఫిబ్రవరి 28, 2025 వరకు వన్‌టైం సెటిల్‌మెంటు ద్వారా డబ్బులు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. గ్రామాల్లో బ్యాంకుకు అప్పు ఉన్న ఖాతాదారులు బ్రాంచ్‌కు వచ్చి తమ బకాయిలు ఎంత ఉన్నాయా అని తెలుసుకుని వన్‌టామ్ సెటిల్‌మెంటు ద్వారా తమ అప్పులు చెల్లించవచ్చన్నారు. అలాగే రైతన్నలు భూమి మీద తీసుకున్న వ్యవసాయ రుణాలు నిర్ణయించిన గడువు తేదీలోపే తమ కంతులు చెల్లించి ప్రభుత్వం నుంచి రాయితీ వడ్డీని పొందాలన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఇన్సూరెన్స్ పథకాలు ప్రతి ఒక్కరూ బ్యాంకులో చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. అలాగే బంగారుపై అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని గృహ, వాహనాలకు అతి తక్కువతోనే రుణా లు అందిస్తున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఏపీజీబీ లక్ష్యమని రీజనల్ మేనేజరు తెలిపారు. ఈ రికవరీ క్యాంపులో చీఫ్ మేనేజరు కామేశ్వర్‌రావు, సీనియర్ మేనేజరు సుశాంత్, బ్రాంచ్ మేనేజరు బాలాదిత్య ఫీల్డ్ ఆఫీసర్లు రాము, ఎస్‌కే అక్బర్, సురేంద్ర, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామాల్లో పర్యటిస్తున్న ఏపీజీబీ అధికారులు

కనువిందు చేస్తున్న బాలపల్లె జలపాతం

రైల్వేకోడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలపల్లె అడవి వద్ద ప్రధాన దారి పక్కనే కొండ మీద నుంచి జలపాతంలా పారుతున్న నీరు వద్ద పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఇటీవల పలు దఫాలుగా కురిసిన భారీ వర్షాలకు శేషాచలం, వెలుగొండ అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు బాలపల్లె వద్ద జలపాతంలా రోడ్డుపై పారుతుండటంతో ప్రయాణికులు అక్కడ సరదాగా గడుపుతున్నారు. రైల్వేకోడూరు మీదుగా తిరుపతి, తిరుమల ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులను ఈ జలపాతం కనువిందు చేస్తోంది.



ప్రయాణికులకు కనువిందు చేస్తున్న జలపాతం

20న రాజంపేట, మదనపల్లిలో ఉద్యోగమేళా

రాజంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రాజంపేట, మదనపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈనెల 20న ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌బీఐ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంకు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశుసంవర్ధక శాఖ డీడీ బదిలీ

కలికిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పశుసంతతి అభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ)లో ఎక్జిక్యూటివ్ అధికారిగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్ జి. రమేష్‌ను మాతృ సంస్థకు వెనక్కి పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టరుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతారాములను నూతన వధూవరులుగా అలంకరణలు చేసి ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. చివరగా హోమం, పూర్ణాహుతి చేసి కల్యాణంలో పాల్గొన్న భక్తులకు టీటీడీ వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సీతా లక్ష్మణ సమేత పట్టాభిరాములకు తిరుచ్చిలో విశేష అలంకరణలు చేసి పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు ధనుష్‌భట్టార్, భాషికార్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

దాల్మియా సిమెంట్స్ బాధిత రైతుల కోసం

ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

కలికిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఏర్పాటు చేసిన దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీతో తలెత్తిన కాలుష్యం, ఫ్యాక్టరీకి సంబంధించిన కట్టలు, ప్రహరీ తదితర సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించడం కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిమెంటు కర్మాగారం కారణంగా పరిసరాల్లోని నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించడానికి ఏడుగురితో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. జిల్లాకు చెందిన ఆర్.మల్లికార్జున చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త ఆదేశాలపై గతంలో 2023 మార్చి 2న జలవనరుల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీరు ఇచ్చిన నివేదికతో పాటు లోకాయుక్త దర్యాప్తు అధికారి నివేదికలను పరిశీలించి సిమెంటు పరిశ్రమ కారణంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా కట్ట ఏర్పాటు, ప్రహరీతో పాటు కర్మాగారం వెదజల్లుతున్న కాలుష్యాన్ని పరిశీలించాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. భూములు కోల్పోయే రైతులకు శాశ్వత పునరావాసాల ఏర్పాటు కోసం వారు కోరుతున్న అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కార మార్గాలు కనుగొనాలని కూడా పేర్కొన్నారు. కడప జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఆర్డీవో, కడప మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టరు, జల వనరుల శాఖ కడప ఎస్ఈ, కడప వ్యవసాయ శాఖ డీడీ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఒకరు, నెల్లూరు మైన్స్ అండ్ జియాలజీ రీజినల్ కార్యాలయం డీడీలను కమిటీగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆరు నెలలుగా జీతాలు రాక...

● కుదేలవుతున్న జీవితాలు

● కొత్త ప్రభుత్వం వచ్చినా తప్పని కష్టాలు

● ఆవేదనలో ఆయాలు, వాచ్‌మెన్‌లు



ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న చిరు కార్మికులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులు విసర్జించిన మలమూత్రాలు శుభ్రం చేసే చిరు కార్మికులపై ప్రభుత్వాలు దయ చూపడం లేదు. ఇచ్చేది అరకొర, అదీ ఆరు నెలలకోమారు ఇస్తుండడంతో వారి జీవితాలు కుదేలవుతున్నాయి. ఇచ్చే జీతాలు కొంతమేరకు వడ్డీలకే సరిపోతోందని వాపోతున్నారు. లక్షల జీతాల పొందే శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలిస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు చాలీచాలనీ జీతాలతో పనిచేసే పాఠశాల, కాలేజీల ఆయాలు, వాచ్‌మెన్‌లకు మాత్రమే ఆరు నెలలవుతున్నా ఇప్పటి వరకు జీతాలు ఇవ్వకపోవడం దారుణం. అసలు ఎప్పుడు జీతాలు వేస్తారో కూడా చెప్పలేని పరిస్థితిలో అధికార యంత్రాంగం ఉంది. జిల్లావ్యాప్తంగా సుమారు 3 వేల మందికి పైగా ఆయాలు పనిచేస్తున్నారు. వీరందరికీ జూన్ వరకు మాత్రమే జీతాలిచ్చారు. గత ప్రభుత్వం హయాంలో పరిస్థితి దారుణంగా ఉండిందని కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా తమ జీవితాలు బాగుపడతాయనికుంటే ఇప్పుడు ఎలాంటి మార్పు లేదని వారు వాపోతున్నారు. బజారులో అప్పులిచ్చేవారు కరువయ్యారని, అత్యవసర పరిస్థితులకు రూ.5 నుంచి రూ.10 వడ్డీలకు తెచ్చుకోవాల్సి వస్తోందని బాధపడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా కేవలం ఒక నెల జీతం మాత్రమే మంజూరు చేసినట్లు ఆయాలు వివరిస్తున్నారు. భరించరాని వాసన ఉన్న మరుగుదొడ్లు, బాత్‌రూంలు క్లీన్ చేస్తున్నాం, కసువు ఊడ్చి విద్యార్థులు అనారోగ్యాల బారిన పడకుండా పనిచేస్తున్నాము. అయినా ఈ ప్రభుత్వాలకు మాపై దయ కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కేవలం ఆరు వేలు మాత్రమే ఇస్తున్నారని అదీ ఆరు నెలలుగా రాలేదని వాపోతున్నారు. మేమెలా బతకాలని నిట్టూరుస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షిని వివరణ కోరగా.. జిల్లా వ్యాప్తంగా 3 వేల మంది ఆయాలున్నారు. వీరికి జూలై నుంచి జీతాలు రాలేదు. ఇప్పటి వరకు బడ్జెట్ రాలేదు. వచ్చిన వెంటనే ఇస్తాం.

ఆరు నెలల నుంచి జీతాలు రావాలి

పాఠశాలలో ఎప్పటి నుంచే పనిచేస్తున్నాం. గతంలో రెండు మూడు నెలలకోసారి జీతాలు వచ్చేవి. ఇప్పుడు ఏకంగా ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. ఇంటి అద్దె కట్టలేకపోతున్నాము. యజమానులు ఖాళీ చేయమంటున్నారు. కిరాణ షాపుల్లో కూడా అప్పులిచ్చేవారు లేకపోవడంతో వడ్డీలకు తెచ్చుకుని జీవిస్తున్నాము. ఇచ్చిన అప్పు కడితే తప్ప మళ్లీ అప్పులివ్వమంటున్నారు. హెచ్‌ఎంతో కూడా రూ.5 వేలు అప్పు తీసుకున్నాము. ఇప్పటికైనా ప్రభుత్వం మాపై దయతలచి వెంటనే జీతాలు మంజూరు చేయాలి.

-రవి, లక్ష్మి, బాలుర ఉన్నత పాఠశాల ఎర్రగుంట

మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకం

● మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు



న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్స్

కడప రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉంటుందని మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో మంగళవారం రెండో రోజు 'మధ్యవర్తిత్వంపై న్యాయవాదుల పాత్ర' అంశంపై శిక్షణను కల్పించారు. జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం వలన ఖర్చు, సమయాన్ని ఆదాచేస్తుందన్నారు. వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నాయన్నారు. అనంతరం కర్ణాటకకు చెందిన రిసోర్స్‌పర్సన్(ట్రైనర్) మిస్ బీనా దేవరాజ్, తమిళనాడుకు చెందిన రిసోర్స్‌పర్సన్(ట్రైనర్) డాక్టర్ ఎస్. పద్మ మధ్యవర్తిత్వం లాయ ర్ల పాత్ర, రాజీనియమాలు, కమ్యూనికేషన్ నిర్వచనం, ప్రక్రియ, ప్రయోజనాలు, రోల్ ప్లే, స్కిల్స్, బాడీలాంగ్వేజ్, చర్చల నైపుణ్యాలు, అడ్డంకులపై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో సేల్స్ ట్యాక్స్ అధికారుల తనిఖీ



బంగారు దుకాణంలో తనిఖీ చేస్తున్న సేల్స్ ట్యాక్స్ అధికారులు

ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగారు, వస్త్ర వ్యాపారాలకు ప్రఖ్యాతి గాంచిన ప్రొద్దుటూరులో మంగళవారం సేల్స్ ట్యాక్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ప్రొద్దుటూరుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు బంగారు, వస్త్ర దుకాణాల్లో వ్యాపారాలు చేస్తుంటారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న ఉరుటూరు గోపాల క్రిష్టయ్య జ్యువెలర్స్‌లో సేల్స్ టాక్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతం నుంచి సాయంత్రం 6.30 వరకు అధికారుల దాడులు కొనసాగాయి. రెండో అధికారుల బృందం మైదుకూరురోడ్డు లోని వస్త్రభారతి, న్యూ వస్త్రభారతి సముదాయాల్లో కూడా తనిఖీ చేపట్టారు. మదనపల్లికి చెందిన సేల్స్ టాక్స్ అధికారులు, స్థానిక అధికారులతో కలిసి ఈ దాడులు సాగించారు. కాగా బంగారు దుకాణం వద్ద దాడుల అనంతరం విలేఖరులు పలు ప్రశ్నలు అడగగా సమాధా నం దాటవేయడంతో ఇవి కేవలం సాధారణ తనిఖీలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీ నిర్వహించామన్నారు.

రోబోటిక్ టెక్నాలజీతో మోకీలు శస్త్రచికిత్స

కడపలో నూతన పద్ధతితో మోకీలు మార్పిడి

విజయవంతమైన శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స అనంతరం మహిళతో డాక్టర్ విద్యాసాగర్

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ టెక్నాలజీతో దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే మారుస్తూ సూక్ష్మ పద్ధతిలో వంద శాతం ఖచ్చితత్వంతో సహజ సిద్ధమైన లిగ్మెంట్స్‌ని పరిరక్షిస్తూ శస్త్రచికిత్స నిర్వహించామని డాక్టర్ సి.విద్యాసాగర్ వివరించారు. కడప నగరంలోని విద్యాసాగర్ హాస్పిటల్‌లో 55ఏళ్ల మహిళకు రోబోటిక్ టెక్నాలజీతో పాక్షిక మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని వివరించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా మోకీలులో మూడు కంపార్ట్‌మెంట్స్ (భాగాలు)గా ఉంటాయి. వాటిలో ఏ భాగం దెబ్బతిన్నా లేదా అరిగినా మోకీలు నొప్పి వస్తుంది. మూడు భాగాల్లో ఒక భాగం దెబ్బతిన్నప్పుడు (యూనీ కంపార్ట్‌మెంటల్ ఆస్ట్రియో ఆర్థరైటిస్) పూర్తిగా మోకీలు మార్పిడి చేయకుండా పాక్షికంగా అరిగిన మోకీలు భాగాన్ని మాత్రమే మార్పిడి చేయవచ్చు. ఈ శస్త్ర చికిత్సను పూర్తి స్థాయిలో వంద శాతం సత్ఫలితాలు తీసుకురావడానికి అత్యాధునిక టెక్నాలజీకి తోడు సర్జన్ ప్రతిభ తోడవ్వాలి. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీ ద్వారా దెబ్బతినని మోకీలు భాగాన్ని యథాతథంగా ఉంచుతూ దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే మారుస్తూ, సూక్ష్మ పద్ధతిలో తక్కువ కోతతో వంద శాతం ఖచ్చితత్వంతో సహజ సిద్ధమైన లిగ్మెంట్స్‌ని పరిరక్షించామని వివరించారు. ఈ విధానం ద్వారా తక్కువ నొప్పి, తక్కువ కోత, సహజమైన దెబ్బతినని మోకీలును పరిరక్షించడం, త్వరితగతిన రికవరీ, సునాయాసమైన మోకీలు కదలికలు, సహజమైన మోకీలు అనే భావన లాంటి సత్ఫలితాలు పొందవచ్చని వివరించారు. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించి అభివృద్ధి చెందిన దేశాల్లో, నగరాల్లో పాక్షిక మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు మన కడప నగరంలో విద్యాసాగర్ హాస్పిటల్‌లో డాక్టర్ సి.విద్యాసాగర్ మొట్టమొదటిసారిగా రోబోటిక్ టెక్నాలజీతో మోకీలు మార్పిడి చేశారు.

విపత్తులు వస్తే సిద్ధంగా ఉండాలి

జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణ



శిక్షణలో మాట్లాడుతున్న రమణ

కడప నాగరాజుపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినపుడు వాటిని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ సిబ్బందికి సూచించారు. భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహిస్తున్న కార్యాచరణ భద్రత, విపత్తు నిర్వహణ శిక్షణ రెండో రోజు కడపలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ ఇస్తున్న దుర్గాప్రసాద్ 2003లో ఉమ్మడి కడప జిల్లా ఎస్ఈగా విధులు నిర్వహించి చీఫ్ ఇంజనీరుగా ఉద్యోగ విరమణ చెందిన వ్యక్తి ద్వారా శిక్షణ తీసుకోవడం అదృష్టంగా భావించాలని తెలిపారు. విద్యుత్ భద్రత విధానాలు, ప్రమాద నివారణ పద్దతులపై, అగ్ని ప్రమాదాలపై లోతైన అవగాహన ఉంటుందని, ప్రమాదం జరిగిన తర్వాత ఎలా నిర్వహించాలో తెలుసుకోవచ్చన్నారు. ఎన్‌పీటీఐ డైరెక్టర్ ముత్తుకుమార్, డీఈఈ కృష్ణదేవ, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అదనపు వర్కర్ల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసనలు తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప(వినాయకనగర్), డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కోవిడ్ కార్మికులు, అదనపు కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే జమ చేయాలని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్ అధ్యక్షతన కార్మికుల అనుబంధ సంస్థ సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వేతన జీవులకు మూడు నెలలుగా జీతాలు వేయడం లేదన్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. పండుగల సమయంలో కార్మికులను పస్తులు పెట్టవద్దన్నారు. న్యాయం జరగకపోతే కడప నగరాన్ని దిగ్బంధం చేస్తామన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించమని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూనియన్ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

కాల్వ స్థలం ఆక్రమణ యత్నం

బెడ్ కడ్డీలు తొలగించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది



వేసిన కడ్డీలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు , డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని శ్రీరాముల పేట వీధిలోని మున్సిపల్ కాల్వ పోరంబోకు స్థలం ఆక్రమణకు శిల్పకల ఫంక్షన్ హాలు యజమానులు యత్నించారు. మంగళవారం తమ ఫంక్షన్ హాలు వెనుక వున్న మున్సిపల్ కాల్వ పరంబోకు స్థలా న్ని చదును చేసి బెడ్ కాంక్రీట్ వేయడానికి కడ్డీలు కట్టారు. అక్కడ ఫంక్షన్ హాలు కోసం వంట షెడ్ నిర్మాణం చేపట్టడానికి ఈ నిర్మాణ పనులు చేపట్టినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. కమిషనర్ మల్లికార్జున ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ వార్డు ప్లానింగ్ సెక్రటరీ మహేష్ సిబ్బందితో వెళ్ళి మున్సిపల్ కాల్వ పో రంబోకు స్థలం ఆక్రమణ యత్నాలను అడ్డుకు న్నారు. చదునుచేసి బెడ్ కాంక్రీట్‌కు సిద్ధంగా వుంచిన కడ్డీలను వాటిని కటింగ్‌చేసే యంత్రాలను సీజ్ చేశారు. ఇప్పటికే శిల్పకల ఫంక్షన్ హాలు నిర్మాణం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించారు. ఈ అక్రమ కట్టడంపై గతంలో పని చేసిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా భారీగా ముడుపులు తీసుకోని వాటిని అనుమతించారు. ఇప్పటికి ఈ కట్టడంపై చార్జ్ షీటు కూడా వేయనట్లు సమాచారం. ఈ అక్రమ కట్టడానికి మున్సిపల్ రెవెన్యూ అధికారులు పన్ను సైతం విధించారు. ఇప్పటికైనా ఈ అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిందితుడికి రిమాండ్

ముద్దనూరు డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): వెల్లుచర్లలో జరిగిన ఘర్షణ కేసులో నిందితుడు రాచకుంట బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

వల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈఓ ఓబులమ్మ తనిఖీ చేశారు. ఎంపీడీఓ రఘురాంతో చర్చించారు. హాజరు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వెలుగు, ఉపాధి సిబ్బందితో సమావేశమై అవగాహన, సూచనలు చేశారు.

బొలెరో దొంగ అరెస్టు

వేంపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచిన బొలెరో వాహనాన్ని దొంగలించిన షేక్ రఫీ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. బైపాస్‌రోడ్డులో ఉండగా పట్టుకుని, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో గ్రూపు విబేధాలు

పోటా పోటీగా వైఎస్ షర్మిల జన్మదినం కార్యక్రమాలు

కడప కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు బయటపడ్డాయి. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున దాదాపు 12 డివిజన్ల నేతలు వేర్వేరుగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ పలు కార్యక్రమాలు చేపట్టారు. కడప నియోజక వర్గం సమన్వయ కమిటీ ఇన్‌చార్జి బండి జకరయ్య ఆధ్వర్యంలో నగరంలోని 5వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి హాజరయ్యారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. జిల్లా కేంద్రం, కడప నియోజక పరిధిలో జరిగే కార్యక్రమాలను తనకు తెలియకుండా చేస్తున్నారని, ఎంత వరకు కరెక్ట్ అంటూ డీసీసీ అధ్యక్షురాలి విజయజ్యోతి వాగ్వాదానికి దిగారు. తాను మూడు తరాలుగా వైఎస్ కుటుంబంతో ఉన్నానని, కడపలో జరిగే కార్యక్రమాలను తనకు తెలియకుండా నిర్వహిస్తున్నారంటూ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ వాదోపవాదాలకు దిగాడు. ఈవిషయంపై తనను అడగవద్దంటూ, చిన్న, చిన్న విషయాలను పెద్దగా చేయవద్దని విజయజ్యోతి కోపంతో కేక్ కట్ చేయకుండానే కార్యాలయం నుంచి బయటకు వెళ్లి పోయారు. అనంతరం అఫ్జల్ ఖాన్ బండి జకరయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు, నేతలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, కాంగ్రెస్ నేతలు పీస్ గౌస్ పీర్, శ్యామలమ్మ, విజయసుశీల్, మామిళ్ల బాబు, ప్రసాద్‌గౌడ్, కుల్లయ్య, మార్తమ్మ, సిరాజుద్దీన్ తదితర నేతలు పాల్గొన్నారు.

బోదకొట్టం దగ్ధం



కాలిపోయిన కొట్టం

ముద్దనూరు డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొలవలి వద్ద నివాసం ఏర్పరచుకున్న యానాది కులస్తుడు దానం పెద్దలయ్య బోద కొట్టం ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. బాధితుడి సమాచారం మేరకు వివరాల్లోకెళితే... కొలవలి వద్ద కొన్నేళ్లగా యానాదులం బోధ కొట్టాలు వేసుకుని నివసిస్తున్నారు. ఇంట్లో నివారు పనులకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో కొట్టంలో నున్న టీవీఎస్ వాహనం, సామగ్రి పూర్తిగా కాలిపోయింది. తమను అధికారులు ఆదుకోవాలని పెద్దలయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణవ పీఠాధిపతి ఆధ్యాత్మిక ప్రవచనాలు



ప్రవచనాలు చెబుతున్న వద్దిపర్తి పద్మాకర్

కడప కలెక్టరేట్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): త్రిభాషా సహస్రావధాని, ప్రణవ పీఠాధిపతి బ్రహ్మర్షి వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. మంగళవారం నగరంలోని అష్టలక్ష్మీ కల్యాణ మండపంలో సుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవాసమితి ఆధ్వర్యంలో దేశభక్తి, ధర్మప్రచార విశిష్టతపై ఆధ్యాత్మిక ప్రవచనాలు వల్లించారు. ఈకార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని 'బలం విష్ణుః ప్రవర్థతాం, బలం గురోః ప్రవర్థతాం' నినాదాలతో సభాస్థలి దైవ నామస్మరణంతో మార్మోగింది. సేవా సమితి అధ్యక్షుడు పరమేశ్వరరెడ్డి, గౌరవాధ్యక్షుడు రామ మూర్తి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి గిరిధర్ రెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైవీయూలో ఐఎస్ఓ ప్రతినిధుల బృందం పరిశీలన

నేడు మరికొన్ని విభాగాలు పరిశీలించే అవకాశం



ఫైల్స్‌ను పరిశీలిస్తున్న ఐఎస్ఓ ప్రతినిధులు - రైఫిల్ షూటింగ్‌కు సంబంధించి పరిశీలిస్తున్న ప్రతినిధి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) ప్రతినిధుల బృందం సందర్శించింది. తొలుత ప్రతినిధుల బృందం హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య, ఆడిటర్ సుమాదేవి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డిని కలిశారు. అనంతరం కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్.ఎల్.సుబ్రమణ్యశర్మ, డీడీ ఎం.సుబోస్‌చంద్ర, గ్రీన్ అండ్ ఎనర్జీ సభ్యులతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ బ్లాక్, సైన్స్ బ్లాక్, గురుకులం భవనాల్లోని డిపార్ట్‌మెంట్లను పరిశీలించారు. శాఖల్లో జరుగుతున్న ప్రగతిని ప్రత్యక్షంగా గమనించారు. నాణ్యమైన బోధన, ప్రయోగాలు, అధునాతన ప్రయోగశాలలు, పరిశోధనలు, అత్యున్నత ప్రమాణాలు కలిగిన పరిశోధన పత్రాలను వారు చూశారు. అధ్యాపకులు పొందిన పేటెంట్లు, ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి అందుకున్న అవార్డులు, వివిధ శాఖల్లో అమలు చేస్తున్న నూతన విధానాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థుల ప్రయోజనార్థం పనిచేస్తున్న పలు విభాగాలు వాటి పనితీరును మదింపుచేశారు. విద్యార్థుల మౌలిక వసతులు, పచ్చదనంతో ఉన్న విద్యాలయ పరిసరాలను ప్రత్యక్షంగా చూశారు. బుధవారం కూడా పరిశీలన ఉంటుందని డాక్టర్ సుబ్రమణ్యశర్మ తెలిపారు. ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రతిష్టాత్మక అత్యున్నత స్థాయి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మొక్కల పెంపకం ఎంతో మహోన్నతం

వీసీ ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన నేలతల్లిని స్మరించుకుంటూ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం ఎంతో మహోన్నతమైందని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనవర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య విశ్వనాథ్‌కుమార్ అన్నారు. మంగళవారం వర్సిటీలో ఆర్తి విజయ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవా పథక కార్యక్రమ అధికారులు, విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సేవా పథక అధికారులు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వరలక్ష్మి, వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి.శివకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెండ్లిమర్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెల్లటూరులో కేంద్ర గ్రామీణశాఖాభివృద్ధి మంత్రి పర్యటనపై ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద నాయక్ డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన, పంటల సాగు గురించి డ్వాక్రా మహిళలు, రైతులతో చర్చించి వడ్డెమాని శివారెడ్డి సాగుచేసిన చామంతి, మినుము, సాంబశివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి సాగుచేసిన వేరుశనగ, మామిడి డ్రిప్‌ను పరిశీలించారు.

నాగాభరణం చోరీ

కొండాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మల్లేశ్వరకోనలో నాగాభరణం చోరికి గురైంది. శివయ్యకు ధరించే నాగాభరణాన్ని సోమవారం మధ్యాహ్నం అపహరణకు గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. వెండితో తయారు చేసిన నాగాభరణం విలువ సుమారు రూ. 2 లక్షల వరకు ఉంటుంది. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు..

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప కలెక్టరేట్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 వతేదీ నుంచి 23 వరకు నిర్వహించనున్న ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఆదేశించారు. డీఆర్వో చాంబరులో ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షల నిర్వహణపై డీఆర్వో సమీక్షించారు. జిల్లాలో 5 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, కన్వెన్షనల్ టైప్‌లో మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో ఉదయం 8-30 గంటల నుంచి 9-30 వరకు, మధ్యాహ్నం 1-30 గంటల నుంచి 2-15 గంటల వరకు మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. కడప ఉక్కాయపల్లెలోని శ్రీశ్రీనివాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో కేఓఆర్ఎం మెమోరియల్ కాలేజీ, ఆఫ్ ఇంజనీరింగ్, కేఎస్ఆర్ఎం కళాశాల, కేఎల్ఎం కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల లు (తాడిగొట్ల), ప్రొద్దుటూరు పరిధిలో- సాయి రాజేశ్వరీలో పరీక్షలు జరుగుతాయన్నారు.

వైవీయూ పూర్వ పరిశోధక విద్యార్థి డాక్టర్ ధీరజ్‌కు ప్రశంసలు



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న ధీరజ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం పూర్వ పరిశోధక విద్యార్థి డాక్టర్.బి.వి.కె.ధీరజ్ అంతర్జాతీయ సదస్సులో ప్రశంసలు అందుకున్నారు. 13 నుంచి 15 వరకు న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్‌లోని వృద్ధులలో అభిజ్ఞా పనితీరుపై సామాజిక-జనాభా చరరాశుల పాత్ర అనే అంశంపై పరిశోధన పత్రాన్నిసమర్పించారు. ధీరజ్ పరిశోధన పత్రాన్ని సోషియో సైకలాజికల్ రంగంలో ఉత్తమమైనదిగా ఎంపిక చేసి శ్రీవేంకటేశ్వర అవార్డును అసోసియేషన్ ఆఫ్ జెరోంటాల జీ, ఇండియా అందజేసింది. అతనికి వైవీయూ సైకాలజీ శాఖ డాక్టర్ కె.లలిత మార్గదర్శకత్వం అందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

కొండాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లావనూరు-చెన్నమ నేనిపల్లె మధ్య మంగళవారం సురేష్(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వంక దగ్గర మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అనంతపురం జిల్లా యల్లనూరు వాసి బాలయ్య కుమారుడిగా పోలీసులు గుర్తించారు. వంక దగ్గర మృతదేహం పడి ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. వివిధ కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. కొండాపురం పోలీసులు యల్లనూరు చేరుకుని స్థానిక పోలీసులతో కలిసి విచారిస్తున్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు రెవెన్యూ సదస్సు

బి.కొత్తకోట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బయప్పగారిపల్లెలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ అన్సారీ పేర్కొన్నారు. రెవెన్యూ పర సమస్యలపై అర్జీలు స్వీకరించి, వాటిని ఆన్‌లైన్ చేసి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

సిద్దవటం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని నేకనాపురం గ్రామానికి చెందిన పల్లె సుబ్బరాయుడు(48) కడప నుంచి ద్విచక్ర వాహనంలో ఒంటిమిట్టకు వెళుతుండగా కనుమలోపల్లె వద్ద చిట్వేలికి వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కారును ఒంటిమిట్ట వద్ద స్వాధీనం చేసుకుని డ్రైవరును విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

మామిడి పంట బీమా నమోదుకు 31 వరకు గడువు

ఓబులవారిపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ ఆధారిత పంటల బీమా నమోదుకు ఈ నెల 31 వరకు అవకాశం ఉందని ఉద్యానవన శాఖ అధికారి భాస్కర్ తెలియజేశారు. మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో గానీ, పీఎంఎఫ్‌బీవై అనే పోర్టల్‌లో మొబైల్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చునన్నారు. అకాల వర్షం, చీడపీడలు, ఉష్ణోగ్రతల వ్యత్యాసం, అధిక గాలి వల్ల సంభవించే నష్టాలకు బీమా వర్తిస్తుందని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో మామిడి ఒక ఎకరాకు 2250 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిసెంబరు 31న ఆఖరు తేదీగా ప్రకటించడం జరిగిందని, ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి అన్ని సచివాలయ పరిధిలో వ్యవసాయ ఉద్యానవన అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు.

లక్కిరెడ్డిపల్లె ఏడీఏ బదిలీ

కలికిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (భూసార సంరక్షణ) కె. చెన్నయ్య బదిలీ అయ్యారు. ఆయనను నంద్యాల జిల్లా శిక్షణ కేంద్రాని (డీటీసీ)కి చెందిన జిల్లా వనరుల కేంద్రాని (డీఆర్‌సీ)కి ఏడీఏగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ కోసం ఆయన చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం ప్రస్తుతం బదిలీలపై వున్న నిషేధాన్ని సడలిస్తూ ఈ ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

పంచాయతీ నిధులతో రోడ్డుకు మరమ్మతులు

రైల్వేకోడూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా దెబ్బతిన్న కోడూరు ప్రధానదారికి మరమ్మతు పనులను మంగళవారం సర్పంచ్ బుడిగి శివయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెంగల్ తుఫాన్ కారణంగా రోడ్డు దెబ్బతినడంతో, పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు.

హామీలు.. నీటి మూటలు!

● అభివృద్ధికి నోచుకోని మార్కెట్ యార్డు ● చినుకుపడితే బురదమయమవుతున్న రోడ్లు

ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నా రైల్వే కోడూరు మార్కెట్ యార్డులోని రోడ్లు మాత్రం మారడంలేదు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చాక ఆ విషయమే మరచిపోతుండడంతో మార్కెట్ యార్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు



బురదమయమైన రోడ్డు

రైల్వేకోడూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): చినుకుపడితే చాలు కోడూరు మార్కెట్ యార్డు రోడ్లు బురదమయం అవుతున్నాయి. సుమారు 20 ఏళ్ల క్రితం రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీలో మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. యార్డు ప్రారంభమైనప్పటి నుంచి రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో ఇప్పటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో ఈ రోడ్లన్నీ బురదమయమై అడుగుతీసి అడుగు వేసేందుకు కూడా వీలు లేకుండా మారుతున్నాయి. ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నా.. మార్కెట్ యార్డులోని రోడ్లు మాత్రం మారడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ మార్కెట్‌లో మామిడి, బొప్పాయి, పాలు తదితర వ్యాపారాలు నిర్వహిస్తారు. ప్రతి ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం సాగుతుంది. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు బొప్పాయి, పాలు, మామిడి కాయల లోడ్లు వెళుతుంటాయి. దీంతో నియోజకవర్గంలోని రైతులందరూ తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. ఆయా రైతుల నుంచి మార్కెట్ కమిటీకి సెస్సు రూపంలో పెద్ద ఎత్తున ఆదాయం కూడా ఉంది. ఈ నిధులతో మార్కెట్ యార్డులో సిమెంట్ రోడ్లు వేయిస్తామని చాలా మంది నాయకులు హామీలు ఇచ్చారు. అయితే ఎన్నికల ముంది ఇచ్చిన హామీలను ఆ తర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారింది. దీంతో వర్షాకాలంలో మార్కెట్ యార్డులో పాదచారులు నడవలేని స్థితి ఉంటుంది. మొత్తం మార్కెట్ యార్డు లోపల సుమారు 7 మట్టి రోడ్లు ఉన్నాయని ఇంత వరకు ఎవరు పట్టించుకోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు మార్కెట్ యార్డులో సిమెంట్ రోడ్లు వేయాలని రైతులు కోరుతున్నారు.



రైల్వేకోడూరు మార్కెట్ యార్డు దుస్థితి

ఆదాయం వస్తున్నా పట్టించుకోరా..

మార్కెట్ యార్డులో సుమారు పది రోడ్లుండగా, అన్నీ మట్టి రోడ్లే ఉన్నాయి. సెస్సుల రూపంలో లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధి విషయం ఎవరూ పట్టించుకోవడం లేదు.

- వీరా, మామిడి వ్యాపారి

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

రాయచోటిటౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై సచివాలయానికి వస్తుంటారని, సచివాలయానికి వచ్చే సర్వీసులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పార్టీలకతీతంగా, ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను అందించినపుడూ ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సచివాలయాలకు వచ్చే అర్జీల వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

చిన్నమండెం: చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా దర్బార్ దృష్టికి వచ్చే సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వీఆర్‌వోల నుంచి తహసీల్దార్ వరకు గ్రామాల్లో పర్యటించి భూ సమస్యలపై ఆరా తీయాలన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు జిల్లా అధికారులకు తెలియజేసి పరిష్కరించాలన్నారు.

సంబేపల్లె: తొలిసారిగా తమ గ్రామానికి వస్తున్నమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, శెట్టిపల్లె గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ ర్యాలీగా రెవెన్యూ సదస్సు నిర్వహించే ప్రాంగణానికి తీసుకువెళ్లారు.

కబ్జాల బారినుంచి కంచాలమ్మ గండి చెరువును రక్షించండి

రాయచోటిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కబ్జాల నుంచి కంచాలమ్మ గండి చెరువుకు విముక్తి కలిగించి ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘం చైర్మన్ పాపిరెడ్డి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు జిల్లా ఇరిగేషన్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కబ్జాల కారణంగా కంచాలమ్మ గండి చెరువు విస్తీర్ణం రోజు రోజుకు తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువు కింద 496 ఎకరాల ఆయకట్టు ఉండగా, 650 రైతు కుటుంబాలుండేవన్నారు. అయితే, కొంత మంది కాలువలను ఆక్రమించి రోడ్లు ఏర్పాటు చేసి అక్రమంగా భవనాలు నిర్మించారన్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే ఆక్రమణలను తొలగించాలని కోరారు. చెరువుకు మరమ్మతులు చేసి ఆయకట్టుకు నీరందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చెరువు కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, సహదేవరెడ్డి, రామకృష్ణారెడ్డి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ ఈఈకి వినతి పత్రం అందజేస్తున్న కంచాలమ్మ గండిచెరువు కమిటీ సభ్యులు

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రొహిబిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.రవి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. నాటుసారా, అక్రమమద్యం విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ తులసి, ఉమ్మడి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ జహీర్ అహ్మద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగంలో పొదుపు పాటించండి

రాజంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు పొదుపు చేయడం చాలా అవసరమని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖర్‌రెడ్డి సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యుత్ డివిజన్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్, మార్కెట్, మెయిన్‌రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండు వరకు సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపుతో పర్యావరణాన్ని కాపాడవచ్చునన్నారు. వినియోగం లేని సమయంలో ఏసీలు, ఫ్యాన్లు, లైట్ల స్విచ్‌లనుఆఫ్ చేయాలన్నారు. డీఈఈ ఎం.సురేంద్రనాథ్, ఏఈలు చంద్రశేఖర్, ఈశ్వర్ రాజు, జేఈలు దస్తగిరి, ఈశ్వర్‌రెడ్డి కుమార్, సుమంత్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలి

రైల్వేకోడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణ శాతం పెరగాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఇప్పటి నుంచే కృషి చేయాలని సూచించారు. అనంతరం పది పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

22న గణితంపై ప్రతిభా పరీక్ష

రాయచోటి టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని స్థానిక శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు గణితంపై ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు శ్రీఅయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9177649784, 9440967988, 9849230243 అనే నెంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

వైద్య విద్యార్థినికి చేయూత

సిద్దవటం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేద వైద్య విద్యార్థిని ఫీజులు చెల్లించేందుకు కడపకు చెందిన తేజస్విని ట్రస్ట్ ఆర్థిక సాయం అందజేసింది. వేంకటేశ్వరపురానికి చెందిన సామల లక్ష్మీ ప్రసన్న ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. ఆమె చదువుల నిమిత్తం ట్రస్ట్ అందజేసిన రూ.25 వేల చెక్కును ఉపాధ్యాయుడు సుధాకర్, మన ఊరికోసం సంస్థ చైర్మన్ అవ్వారు రవి శంకర్ మంగళవారం విద్యార్థిని తల్లి సుబ్బలక్ష్మమ్మకు అందజేశారు. వెంకటేశ్వరపురం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతి కుమారి, నరసింహులు, కృష్ణయ్య, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

రామాపురం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు కస్పా శివాలయం వద్ద మంగళవారం గాలివీటి సురేంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వంద మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు దేవదర్శన్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, సహదేవరెడ్డి, మానిటరింగ్ కమిటీ సభ్యులు గంపా వెంకట్రమణ, చిన్నప్ప, లక్ష్మయ్య, రమేశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు టీచర్లుగా గుర్తించే వరకు పోరాటం

● ట్రైబల్ గురుకుల పాఠశాల టీచర్ల ఆందోళన

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ట్రైబల్ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను కాంట్రాక్టు టీచర్లుగా మార్చే వరకు పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాం జులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీ. భాగ్యలక్ష్మి ప్రకటించారు. మంగళవారం సీఐటీయూ నేతలతో కలసి ట్రైబల్ టీచర్స్ ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్లకార్డులు చేత బట్టి టెంట్‌వేసి ఉపాధ్యాయులు శ్రీనివాసులు నాయక్, మహదేవ్, హరిత, సరోజ స్థానిక కలెక్టరేట్ ఎదుట దీక్షలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా ట్రైబల్ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ట్రైబల్ టీచర్ల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు సిద్దమ్మ, అరుణ, సునీత, రమీజా, ఇర్షాద్, సురేఖ, ట్రైబల్ టీచర్స్ మహదేవ్, వియకుమారి, స్వర్ణ, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, ప్రదీప్, సౌజన్య, దేవి, కాదంబరి, గత, సుధాకర్, సమతి, ప్రకాశ్, వనిత, త్రివేణి, కల్పన, సుభాషిణి, చందన, సుజాత, లావణ్య పాల్గొన్నారు.

'అన్నదాతలను ఆదుకోకుంటే బీజేపీకి పుట్టగతులుండవు'

సిద్దవటం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆల్ ఇండియా అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర మహిళా కార్యదర్శి సుబ్బమ్మ అన్నారు. బీహార్ రాజధాని పాట్నాలో మంగళవారం నిర్వహించిన ఆ పార్టీ 10వ జాతీయ మహాసభలో మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన ఆమె ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకపక్క రైతులు తమ హక్కులను కాపాడాలని పోరాడుతుంటే నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రం రైతులను అణగదొక్కే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. 60 ఏళ్లు దాటిన ప్రతిరైతుకు బీమా, సబ్సిడీపై విత్తనాలు, అగ్రికల్చర్ కార్పొరేషన్ ద్వారా రైతులకు లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ప్రదీప్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

● జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ రమేష్

రైల్వేకోడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను పాడి రైతులు ఉపయోగించుకోవాలని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ రమేష్ తెలిపారు. మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు మండలంలోని చియ్యవరం కమ్మపల్లెలో పశువైద్య, గర్భకోశ వ్యాధుల మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు అవసరమైన మందులు పశువైద్యశాలలో ఉన్నాయని తెలిపారు. ఈ శిబిరంలో 28 పశువులకు గర్భకోశ పరీక్షలు, 62 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. 65 పశువులకు ఖనిజ లవణ మిశ్రమం, పలు మందులకు పిడుదల నివారణ మందు పిచికారీ చేసినట్లు తెలిపారు. పాడి రైతులకు రూ. 20 వేలు విలువ చేసే మందులు, పోషకాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పశు సంవర్ధశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ విజయ భాస్కర్‌రావు, రైల్వేకోడూరు సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌రాజు, వీపీఆర్‌కండ్రిక పశువైద్యాధికారిణి నాగశిరీషా, శెట్టిగుంట పశు వైద్యాధికారి ప్రతాప్, రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రలు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



నట్టల నివారణ మందు వేస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ రమేష్

అంతర్ జిల్లా కురేష్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

రైల్వేకోడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 68వ అంతర్ జిల్లా కురేష్ క్రీడా ఎంపికలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో అనంతపురం, ఉమ్మడి కడప జిల్లాల క్రీడాకారులు సత్తాచాటుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చమర్తి శారద మాట్లాడుతూ ఈ పోటీలు అండర్ 14, 17, 19 విభాగాల్లో బాలురు, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో అనంతపురం క్రీడాకారులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రెండోవ స్థానాన్ని ఉమ్మడి కడప జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారని తెలిపారు. త్వరలో జాతీయ స్థాయిలో చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో నిర్వహించే కురేష్ పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సుగుణమ్మ, చంద్రకుమార్, కోడూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై. నరసింహమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు విజయప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు అరుణకుమారి, నాగేశ్వర్ రెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన బాలుర జట్టు

బాల్య వివాహాలను అరికట్టాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి తెలిపారు. మంగళవారం స్థానిక సచివాలయంలో అంగన్‌వాడీ వర్కర్లకు కిశోర వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కిశోర బాలికలకు విద్య, ఆరోగ్యం, పరి శుభ్రతలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ రెడ్డెయ్య మాట్లాడుతూ బాల్యవివాహాలను మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అరికట్టాలన్నారు. ప్రతి బాలిక చదువుకునేట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చక్రేనాయక్, సూపర్‌వైజర్లు, దాద్‌బీ, తులసమ్మ, లక్ష్మి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సంబేపల్లె: కిశోర బాలికలు ఉన్నత చదువులు చదువుకుని తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహించాలని ఏపీ డీపీవో సుగుణ తెలిపారు. మంగళవారం సంబేపల్లిలోని వెలుగు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నారులందరినీ బడిలో చేర్పించి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.ఎంఈవో శ్రీనివాసులు, ఏపీయం సంజీవరాజు, సీహెచ్‌వో ఎస్‌ఆర్ రాణి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు నాగరత్న, రూపాలక్ష్మి, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి); గ్రామాల సుస్థిరాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ రెడ్డెయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి లోకలైజేషన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామా పంచాయతీ, సచివాలయ సిబ్బంది గ్రామంలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణళిక తయారు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అధికారులు, పంచాయతి సిబ్బంది, ప్రజా ప్రతినిధులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్ , ఏవో సోమశేఖర్, పంచాయతీ ఏఈ కృష్ణప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించండి

గాలివీడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నియమాలను పాటిస్తే సురక్షితంగా గమ్యానికి చేరవచ్చునని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం గాలివీడు- రాయచోటి మార్గంలో ప్రమాదాల నివారణ సూచికలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. అతివేగమే ప్రమాదాలకు కారణమన్నారు. మలుపులు, రద్దీప్రాంతాలు, క్రాసింగుల వద్ద జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని తెలిపారు. వాహనాలకు పర్మిట్లు, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవర్లకు లైసెన్సులు తప్పక ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది రామాంజులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాద సూచికలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

'కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం'

సుండుపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సుండుపల్లెలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందు కు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్, మండల అధ్య క్షుడు షేక్. సల్మాన్, జిల్లా కార్యదర్శి మస్తాన్, అసెంబ్లీ ఇన్‌చార్జి మహమ్మద్ ఆదిల్, రాయచోటి టౌన్ ప్రెసిడెంట్ బాబాసిద్దిక్, అమీర్‌బాషా, కాంగ్రెస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్

బహు సుందరం.. ఈ తామర పత్రం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక సినిమాల్లో తరచూ మనం చూస్తుంటాం. తామర పువ్వు, తామర ఆకులపై దేవతామూర్తులు దర్శనమిస్తుంటారు. వాటిని చూసి ఎంతో ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలుగుతుంది. అయితే అది కేవలం సినిమా జిమ్మిక్స్ అని చెప్పాలి. అయితే కడప యోగివేమన యూనివర్సిటీలో అటువంటి తామరపత్రం దర్శనమిచ్చింది. ఈ తామరపత్రంపై 36 కేజీల బరువున్న అమ్మాయి కూర్చున్నా సరే.. ఆ పత్రానికి ఎటువంటి నష్టం కలగలేదు. ఈ మొక్కను జెయింట్ వాటర్ లిల్లీ అని పిలుస్తారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద తామర మొక్క అని చెబుతున్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌లో 2019 జూలైలో పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా సుభాష్ చంద్రబోస్ బొటానికల్ గార్డెన్ నుంచి ఈ మొక్కను తీసుకువచ్చి నాటారు. ఈ మొక్క ఒక్కొక్కటిగా ఎదుగుతూ ప్రస్తుతం కొలనును పూర్తిగా ఆక్రమించుకుంది. ఈ కలువలతో కొలను ఎంతో సుందరంగా దర్శనిమిస్తోంది. ఇది సువాసన వెదజల్లడంతో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

చరిత్ర తెలుసుకుందాం...

విక్టోరియా అమెజానిక ప్రపంచంలోనే అతిపెద్ద నీటి కలువ ఈ మొక్క. అమెజాన్ నదీ పరివాహక ప్రాంతానికి చెందినది. ప్రధానంగా ఉష్ణమండల దక్షిణ అమెరికాలో పెరుగుతుంది. ఇది గయానా జాతీయ పుష్పం. విక్టోరియా అమెజానిక చాలా పెద్ద ఆకులు కలిగి ఉంటుంది. నీటి ఉపరితలంపై ఐదు నుంచి ఎనిమిది మీటర్ల పొడవుతో నీటిలో ఉన్న కొమ్మపై తేలుతూ ఉంటుంది. పువ్వులు ఉదయం తెల్లగా ఉంటాయి.

అదేరోజు సాయంత్రానికి గులాబీ లేదా ఊదా రంగులోకి మారుతుంటాయి. పువ్వులు అతిపెద్దవి 12 అంగుళాల వ్యాసం కలిగి ఉంటాయి. వీటి ఆకులు మూడు మీటర్ల వరకు వ్యాసం కలిగి ఉంటాయి. తామరాకు 40 కేజీల వరకు బరువును మోస్తాయని వైవీయూ బాటనీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



బాటనీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం

కడప నగరం యోగివేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌లో ఉన్న జెయింట్ వాటర్ లిల్లీ మొక్కను ప్రతి ఒక్కరూ చూడాల్సిందే. ఇది బాటనీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. ఈ మొక్కతో పాటు ఇంకా అనేక రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వాటిపై విద్యార్థులు అధ్యయనం చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. ఈ అరుదైన మొక్కను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు వచ్చి ప్రత్యక్షంగా పరిశీలించి వెళ్తుంటారు.





జెయింట్ లిల్లీ ఆకుపై కూర్చున్న విద్యార్థిని, అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి

10 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



సిద్దవటం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టక్కోలి సమీపంలో ఉన్న పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో టక్కోలి వద్ద పెన్నానదిలో మంగళవారం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కడపకు ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఆర్ఐ ప్రసాద్, స్థానిక పోలీసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రాజంపేటలో చైన్ స్నాచర్ల హల్‌చల్

రాజంపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోయనపల్లెలో మంగళవారం చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో వెళుతున్న ఓ మహిళ చైను కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. బోయనపల్లె ప్రధాన రహదారిపై వెళుతున్న మరో మహిళపై దాడి చేసి నాలుగు తులాల బంగారు చైనును దొంగలించుకుని పరారయ్యాడు. ఒక్క రోజులోనే వేర్వేరు చోట్ల చైన్ స్నాచర్లు తెగబడడంతో పట్టణవాసులు ఆందోళనకు గురవుతున్నారు..

ఇసుక డంపు సీజ్



ఇసుక డంపును సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

గుర్రంకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురులు అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును పోలీస్, రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. 'ఈ ఇసుక డంపులు ఎవరివి' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసులు తరిగొండ రామానాయునిచెరువు పరిసరాల్లో ఇసుక డంపు లను గుర్తించారు. ఇందులో భాగంగా రుద్రవారిపల్లె సమీపంలోని రైతుల పొలాల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును సీజ్ చేశారు. ఈ ఇసుక డంపులో సగానికిపైగా ఇసుకను రాత్రికి రాత్రే తరలించేశారు. అలాగే పక్కనున్న మరో ఇసుక డంపులో పూర్తిగా ఇసుకను ఖాళీ చేశారు. దీంతో నాలుగు ట్రాక్టర్ లోడ్ల ఇసుక డంపును అధికారులు సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కాగా పోలీసులు, రెవెన్యూ అధికారులు వస్తు న్నట్లు తెలుసుకున్న ఇసుకాసురులు చెరువులో ఇసుక నింపుతున్న ట్రాక్టర్లతో సహా పరారయ్యారు. కార్యక్రమంలో వీఆర్వో నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిల ఆటలు కట్టిస్తాం.. సీఐ

- బాలికల గురుకుల కళాశాలలో పోలీసుల తనిఖీలు



గురుకుల కళాశాలలో తనిఖీ చేస్తున్న సీఐ ప్రసాద్‌బాబు

వాల్మీకిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని తరిగొండ రోడ్డులో గల ఏపీ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలి యని ఆకతాయిలు హల్‌చల్ చేసి కళాశాలలోని బాలికలను బెదిరింపులకు గురిచేశారన్న విషయమై కళాశాల ప్రిన్సిపాల్ రామాంజుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మంగళవారం స్థానిక సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌లు కళాశాలలో విస్తృత తనిఖీ లు చేపట్టారు. స్థానిక స్థితిగతులను పరిశీలిస్తూ బాలికల భద్రత విషయమై వివరాలను ఆరా తీశారు. ఈసందర్భంగా సీఐ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కళాశాలలో అర్ధరాత్రి బాలి కలను భయబ్రాంతులకు గురిచేసిన ఆకతాయిల విషయమై నిఘా పెట్టామన్నారు. ఇకపై నిత్యం గురుకుల కళాశాల, హైస్కూల్ ప్రాంతంలో పోలీసుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్లపై శృతిమించి ద్విచక్రవాహనాలు నడపడం, ఈవ్ టీజింగ్ లాంటి వాటిపై ప్రత్యే నిఘా పెట్టామని, పట్టుబడితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మాకు తెలుసు.. మేం చూపిస్తాం.. పో!

- దళితులపై డిప్యూటీ తహసీల్దారు ఆగ్రహం
- శ్మశానానికి దారి కోసం కార్యాలయం ఎదుట నిరసన



సచివాలయం ముందు నిరసన తెలియజేస్తున్న దృశ్యం

పుల్లంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్మశానానికి స్థలం చూపారు. కానీ , అక్కడికి వెళ్లేందుకు దారి చూపాలని, రెండేళ్లుగా ఈ సమస్యపై తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని చొప్పావారిపల్లెకు చెందిన దళితులు కోరగా, మాకు తెలుసు.. మేం చూపిస్తాం..పో.. అంటూ డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కొమ్మనవారిపల్లెలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ దృశ్యం కనిపించింది. దీంతో అవాక్కైన ఫిర్యాదుదారులు ఇదేమిటని ఆమెను ప్రశ్నించగా, మీరు కలెక్టర్‌తో మాట్లాడుతారా, జేసీతో మాట్లాడుతారా చెప్పండి. ఇప్పుడే ఫోన్ చేస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేయగా.. షటప్ అంటూ రెచ్చిపోయారు. అర్జీ ఇచ్చారు.. మిగతాది మేము చూసుకుంటాం. ఎక్కువ మాట్లాడితే పోలీసులను పిలిపిస్తా అంటూ ఫిర్యాదుదారులను భయపెట్టారు. దీంతో దళితులు తమకు న్యాయం చేయాలంటూ నిరసన తెలియజేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దారు ఎస్ఐకి ఫోన్ చేసి గ్రామస్తులపై ఫిర్యాదు చేశారు. పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ రెవెన్యూ సదస్సుకు చేరుకుని విచారణ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



బి.కొత్తకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరి జనార్ధన్, విజయనిర్మల (34) భార్యాభర్తలు. విజయనిర్మల పుట్టినిల్లు పీటీఎం మండలంలోని పులికల్లు. వారికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. జనార్ధన్ లారీడ్రైవర్ కాగా, విజయనిర్మల మదనపల్లెలోని ఓ గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. ఇటీవలి కాలంలో వారి మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో విజయనిర్మల మంగళవారం తెల్లవారు ఝామున ఇంట్లోనే శవమై కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగాధర్‌బాబు తెలిపారు.

సకాలంలో రుణాలు చెల్లించండి

ఏపీజీబీ రీజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ స్వారో



గ్రామాల్లో పర్యటిస్తున్న ఏపీజీబీ అధికారులు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాం కు నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని రాజంపేట డివిజను రీజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ స్వారో తెలిపారు. మంగళవారం మండలంలోని చెంచయ్యగారిపల్లె, లింగందిన్నెపల్లె, బ్రహ్మంగారిమఠం, మల్లేపల్లె గ్రామాల్లో బ్యాంకుకు అప్పు ఉన్న ఖాతాదారుల వద్దకు రికవరీ కోసం వెళ్లారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజరు మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యాంకు నుంచి రూ.8.90 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఈ ప్రజలు ఫిబ్రవరి 28, 2025 వరకు వన్‌టైం సెటిల్‌మెంటు ద్వారా డబ్బులు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. గ్రామాల్లో బ్యాంకుకు అప్పు ఉన్న ఖాతాదారులు బ్రాంచ్‌కు వచ్చి తమ బకాయిలు ఎంత ఉన్నాయా అని తెలుసుకుని వన్‌టౌమ్ సెటిల్‌మెంటు ద్వారా తమ అప్పులు చెల్లించవచ్చన్నారు. అలాగే రైతన్నలు భూమి మీద తీసుకున్న వ్యవసాయ రుణాలు నిర్ణయించిన గడువు తేదీలోపే తమ కంతులు చెల్లించి ప్రభుత్వం నుంచి రాయితీ వడ్డీని పొందాలన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఇన్సూరెన్స్ పథకాలు ప్రతి ఒక్కరూ బ్యాంకులో చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. అలాగే బంగారుపై అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని గృహ, వాహనాలకు అతి తక్కువతోనే రుణా లు అందిస్తున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఏపీజీబీ లక్ష్యమని రీజనల్ మేనేజరు తెలిపారు. ఈ రికవరీ క్యాంపులో చీఫ్ మేనేజరు కామేశ్వర్‌రావు, సీనియర్ మేనేజరు సుశాంత్, బ్రాంచ్ మేనేజరు బాలాదిత్య ఫీల్డ్ ఆఫీసర్లు రాము, ఎస్‌కే అక్బర్, సురేంద్ర, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న బాలపల్లె జలపాతం



ప్రయాణికులకు కనువిందు చేస్తున్న జలపాతం

రైల్వేకోడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలపల్లె అడవి వద్ద ప్రధాన దారి పక్కనే కొండ మీద నుంచి జలపాతంలా పారుతున్న నీరు వద్ద పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఇటీవల పలు దఫాలుగా కురిసిన భారీ వర్షాలకు శేషాచలం, వెలుగొండ అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు బాలపల్లె వద్ద జలపాతంలా రోడ్డుపై పారుతుండటంతో ప్రయాణికులు అక్కడ సరదాగా గడుపుతున్నారు. రైల్వేకోడూరు మీదుగా తిరుపతి, తిరుమల ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులను ఈ జలపాతం కనువిందు చేస్తోంది.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతారాములను నూతన వధూవరులుగా అలంకరణలు చేసి ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో ఏర్పాటు చేసిన కళ్యాణ వేధికపై ఆశీనులు గావించారు. మంగళవాద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. చివరగా హోమం, పూర్ణాహుతి చేసి కల్యాణంలో పాల్గొన్న భక్తులకు టీటీడీ వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సీతా లక్ష్మణ సమేత పట్టాభిరాములకు తిరుచ్చిలో విశేష అలంకరణలు చేసి పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు ధనుష్‌భట్టార్, భాషికార్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

దాల్మియా సిమెంట్స్ బాధిత రైతుల కోసం

ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

కలికిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఏర్పాటు చేసిన దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీతో తలెత్తిన కాలుష్యం, ఫ్యాక్టరీకి సంబంధించిన కట్టలు, ప్రహరీ తదితర సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించడం కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిమెంటు కర్మాగారం కారణంగా పరిసరాల్లోని నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించడానికి ఏడుగురితో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. జిల్లాకు చెందిన ఆర్.మల్లికార్జున చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త ఆదేశాలపై గతంలో 2023 మార్చి 2న జలవనరుల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీరు ఇచ్చిన నివేదికతో పాటు లోకాయుక్త దర్యాప్తు అధికారి నివేదికలను పరిశీలించి సిమెంటు పరిశ్రమ కారణంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా కట్ట ఏర్పాటు, ప్రహరీతో పాటు కర్మాగారం వెదజల్లుతున్న కాలుష్యాన్ని పరిశీలించాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. భూములు కోల్పోయే రైతులకు శాశ్వత పునరావాసాల ఏర్పాటు కోసం వారు కోరుతున్న అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కార మార్గాలు కనుగొనాలని కూడా పేర్కొన్నారు. కడప జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఆర్డీవో, కడప మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టరు, జల వనరుల శాఖ కడప ఎస్ఈ, కడప వ్యవసాయ శాఖ డీడీ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఒకరు, నెల్లూరు మైన్స్ అండ్ జియాలజీ రీజినల్ కార్యాలయం డీడీలను కమిటీగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

20న రాజంపేట, మదనపల్లిలో

ఉద్యోగమేళా

రాజంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రాజంపేట, మదనపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈనెల 20న ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌బీఐ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంకు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశుసంవర్ధక శాఖ

డీడీ బదిలీ

కలికిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పశుసంతతి అభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ)లో ఎక్జిక్యూటివ్ అధికారిగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్ జి. రమేష్‌ను మాతృ సంస్థకు వెనక్కి పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టరుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరు నెలలుగా జీతాలు రాక...

- కుదేలవుతున్న జీవితాలు
- కొత్త ప్రభుత్వం వచ్చినా తప్పని కష్టాలు
- ఆవేదనలో ఆయాలు, వాచ్‌మెన్‌లు



ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న చిరు కార్మికులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులు విసర్జించిన మలమూత్రాలు శుభ్రం చేసే చిరు కార్మికులపై ప్రభుత్వాలు దయ చూపడం లేదు. ఇచ్చేది అరకొర, అదీ ఆరు నెలలకోమారు ఇస్తుండడంతో వారి జీవితాలు కుదేలవుతున్నాయి. ఇచ్చే జీతాలు కొంతమేరకు వడ్డీలకే సరిపోతోందని వాపోతున్నారు. లక్షల జీతాల పొందే శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలిస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు చాలీచాలనీ జీతాలతో పనిచేసే పాఠశాల, కాలేజీల ఆయాలు, వాచ్‌మెన్‌లకు మాత్రమే ఆరు నెలలవుతున్నా ఇప్పటి వరకు జీతాలు ఇవ్వకపోవడం దారుణం. అసలు ఎప్పుడు జీతాలు వేస్తారో కూడా చెప్పలేని పరిస్థితిలో అధికార యంత్రాంగం ఉంది. జిల్లావ్యాప్తంగా సుమారు 3 వేల మందికి పైగా ఆయాలు పనిచేస్తున్నారు. వీరందరికీ జూన్ వరకు మాత్రమే జీతాలిచ్చారు. గత ప్రభుత్వం హయాంలో పరిస్థితి దారుణంగా ఉండిందని కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా తమ జీవితాలు బాగుపడతాయనికుంటే ఇప్పుడు ఎలాంటి మార్పు లేదని వారు వాపోతున్నారు. బజారులో అప్పులిచ్చేవారు కరువయ్యారని, అత్యవసర పరిస్థితులకు రూ.5 నుంచి రూ.10 వడ్డీలకు తెచ్చుకోవాల్సి వస్తోందని బాధపడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా కేవలం ఒక నెల జీతం మాత్రమే మంజూరు చేసినట్లు ఆయాలు వివరిస్తున్నారు. భరించరాని వాసన ఉన్న మరుగుదొడ్లు, బాత్‌రూంలు క్లీన్ చేస్తున్నాం, కసువు ఊడ్చి విద్యార్థులు అనారోగ్యాల బారిన పడకుండా పనిచేస్తున్నాము. అయినా ఈ ప్రభుత్వాలకు మాపై దయ కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కేవలం ఆరు వేలు మాత్రమే ఇస్తున్నారని అదీ ఆరు నెలలుగా రాలేదని వాపోతున్నారు. మేమెలా బతకాలని నిట్టూరుస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షిని వివరణ కోరగా.. జిల్లా వ్యాప్తంగా 3 వేల మంది ఆయాలున్నారు. వీరికి జూలై నుంచి జీతాలు రాలేదు. ఇప్పటి వరకు బడ్జెట్ రాలేదు. వచ్చిన వెంటనే ఇస్తాం.

ఆరు నెలల నుంచి జీతాలు రావాలి

పాఠశాలలో ఎప్పటి నుంచే పనిచేస్తున్నాం. గతంలో రెండు మూడు నెలలకోసారి జీతాలు వచ్చేవి. ఇప్పుడు ఏకంగా ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. ఇంటి అద్దె కట్టలేకపోతున్నాము. యజమానులు ఖాళీ చేయమంటున్నారు. కిరాణ షాపుల్లో కూడా అప్పులిచ్చేవారు లేకపోవడంతో వడ్డీలకు తెచ్చుకుని జీవిస్తున్నాము. ఇచ్చిన అప్పు కడితే తప్ప మళ్లీ అప్పులివ్వమంటున్నారు. హెచ్ఎంతో కూడా రూ.5 వేలు అప్పు తీసుకున్నాము. ఇప్పటికైనా ప్రభుత్వం మాపై దయతలచి వెంటనే జీతాలు మంజూరు చేయాలి.

-రవి, లక్ష్మి, బాలుర ఉన్నత పాఠశాల ఎర్రగుంట

మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకం

● మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వర్లరావు



న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్స్

కడప రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉంటుందని మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో మంగళవారం రెండో రోజు 'మధ్యవర్తిత్వంపై న్యాయవాదుల పాత్ర' అంశంపై శిక్షణను కల్పించారు. జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం వలన ఖర్చు, సమయాన్ని ఆదాచేస్తుందన్నారు. వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నాయన్నారు. అనంతరం కర్ణాటకకు చెందిన రిసోర్స్‌పర్సన్(ట్రైనర్) మిస్ బీనా దేవరాజ్, తమిళనాడుకు చెందిన రిసోర్స్‌పర్సన్(ట్రైనర్) డాక్టర్ ఎస్. పద్మ మధ్యవర్తిత్వం లాయర్ల పాత్ర, రాజీనియమాలు, కమ్యూనికేషన్ నిర్వచనం, ప్రక్రియ, ప్రయోజనాలు, రోల్ ప్లే, స్కిల్స్ బాడీలాంగ్వేజ్, చర్చల నైపుణ్యాలు, అడ్డంకులపై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో సేల్స్ ట్యాక్స్ అధికారుల తనిఖీ



బంగారు దుకాణంలో తనిఖీ చేస్తున్న సేల్స్ ట్యాక్స్ అధికారులు

ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగారు, వస్త్ర వ్యాపారాలకు ప్రఖ్యాతి గాంచిన ప్రొద్దుటూరులో మంగళవారం సేల్స్ ట్యాక్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ప్రొద్దుటూరుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు బంగారు, వస్త్ర దుకాణాల్లో వ్యాపారాలు చేస్తుంటారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న ఉరుటూరు గోపాల క్రిష్టయ్య జ్యువెలర్స్‌లో సేల్స్ టాక్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతం నుంచి సాయంత్రం 6.30 వరకు అధికారుల దాడులు కొనసాగాయి. రెండో అధికారుల బృందం మైదుకూరురోడ్డు లోని వస్త్రభారతి, న్యూ వస్త్రభారతి సముదాయాల్లో కూడా తనిఖీ చేపట్టారు. మదనపల్లికి చెందిన సేల్స్ టాక్స్ అధికారులు, సానిక అధికారులతో కలిసి ఈ దాడులు సాగించారు. కాగా బంగారు దుకాణం వద్ద దాడుల అనంతరం విలేఖరులు పలు ప్రశ్నలు అడగగా సమాధానం దాటవేయడంతో ఇవి కేవలం సాధారణ తనిఖీలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీ నిర్వహించామన్నారు.

రోబోటిక్ టెక్నాలజీతో మోకీలు శస్త్రచికిత్స

కడపలో నూతన పద్ధతితో మోకీలు మార్పిడి విజయవంతమైన శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స అనంతరం మహిళతో డాక్టర్ విద్యాసాగర్

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ టెక్నాలజీతో దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే మారుస్తూ సూక్ష్మ పద్ధతిలో వంద శాతం ఖచ్చితత్వంతో సహజ సిద్ధమైన లిగ్మెంట్స్‌ని పరిరక్షిస్తూ శస్త్రచికిత్స నిర్వహించామని డాక్టర్ సి.విద్యాసాగర్ వివరించారు. కడప నగరంలోని విద్యాసాగర్ హాస్పిటల్‌లో 55ఏళ్ల మహిళకు రోబోటిక్ టెక్నాలజీతో పాక్షిక మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని వివరించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా మోకీలులో మూడు కంపార్ట్ మెంట్స్ (భాగాలు)గా ఉంటాయి. వాటిలో ఏ భాగం దెబ్బతిన్నా లేదా అరిగినా మోకీలు నొప్పి వస్తుంది. మూడు భాగాల్లో ఒక భాగం దెబ్బతిన్నప్పుడు (యూనీ కంపార్ట్ మెంటల్ ఆస్ట్రియో ఆర్థరైటిస్) పూర్తిగా మోకీలు మార్పిడి చేయకుండా పాక్షికంగా అరిగిన మోకీలు భాగాన్ని మాత్రమే మార్పిడి చేయవచ్చు. ఈ శస్త్ర చికిత్సను పూర్తి స్థాయిలో వంద శాతం సత్ఫలితాలు తీసుకురావడానికి అత్యాధునిక టెక్నాలజీకి తోడు సర్జన్ ప్రతిభ తోడవ్వాలి. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీ ద్వారా దెబ్బతినని మోకీలు భాగాన్ని యథాతథంగా ఉంచుతూ దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే మారుస్తూ, సూక్ష్మ పద్ధతిలో తక్కువ కోతతో వంద శాతం ఖచ్చితత్వంతో సహజ సిద్ధమైన లిగ్మెంట్స్‌ని పరిరక్షించామని వివరించారు. ఈ విధానం ద్వారా తక్కువ నొప్పి, తక్కువ కోత, సహజమైన దెబ్బతినని మోకీలును పరిరక్షించడం, త్వరితగతిన రికవరీ, సునాయాసమైన మోకీలు కదలికలు, సహజమైన మోకీలు అనే భావన లాంటి సత్ఫలితాలు పొందవచ్చని వివరించారు. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించి అభివృద్ధి చెందిన దేశాల్లో, నగరాల్లో పాక్షిక మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు మన కడప నగరంలో విద్యాసాగర్ హాస్పిటల్‌లో డాక్టర్ సి.విద్యాసాగర్ మొట్టమొదటిసారిగా రోబోటిక్ టెక్నాలజీతో మోకీలు మార్పిడి చేశారు.

విపత్తులు వస్తే సిద్ధంగా ఉండాలి

జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణ



శిక్షణలో మాట్లాడుతున్నరమణ

కడప నాగరాజుపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినపుడు వాటిని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ సిబ్బందికి సూచించారు. భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహిస్తున్న కార్యాచరణ భద్రత, విపత్తు నిర్వహణ శిక్షణ రెండో రోజు కడపలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ ఇస్తున్న దుర్గాప్రసాద్ 2003లో ఉమ్మడి కడప జిల్లా ఎస్‌ఈగా విధులు నిర్వహించి చీఫ్ ఇంజనీరుగా ఉద్యోగ విరమణ చెందిన వ్యక్తి ద్వారా శిక్షణ తీసుకోవడం అదృష్టంగా భావించాలని తెలిపారు. విద్యుత్ భద్రత విధానాలు, ప్రమాద నివారణ పద్ధతులపై, అగ్ని ప్రమాదాలపై లోతైన అవగాహన ఉంటుందని, ప్రమాదం జరిగిన తర్వాత ఎలా నిర్వహించాలో తెలుసుకోవచ్చన్నారు. ఎన్‌పీటీఐ డైరెక్టర్ ముత్తుకుమార్, డీఈఈ కృష్ణదేవ, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అదనపు వర్కర్ల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసనలు తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప(వినాయకనగర్), డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కోవిడ్ కార్మికులు, అదనపు కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే జమ చేయాలని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్ అధ్యక్షతన కార్మికుల అనుబంధ సంస్థ సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వేతన జీవులకు మూడు నెలలుగా జీతాలు వేయడం లేదన్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. పండుగల సమయంలో కార్మికులను పస్తులు పెట్టవద్దన్నారు. న్యాయం జరగకపోతే కడప నగరాన్ని దిగ్బంధం చేస్తామన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ కల్పించమని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూనియన్ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

కాల్వ స్థలం ఆక్రమణ యత్నం

బెడ్ కడ్డీలు తొలగించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది



వేసిన కడ్డీలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు , డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని శ్రీరాముల పేట వీధిలోని మున్సిపల్ కాల్వ పోరంబోకు స్థలం ఆక్రమణకు శిల్పకల ఫంక్షన్ హాలు యజమానులు యత్నించారు. మంగళవారం తమ ఫంక్షన్ హాలు వెనుక వున్న మున్సిపల్ కాల్వ పరంబోకు స్థలాన్ని చదును చేసి బెడ్ కాంక్రీట్ వేయడానికి కడ్డీలు కట్టారు. అక్కడ ఫంక్షన్ హాలు కోసం వంట షెడ్ నిర్మాణం చేపట్టడానికి ఈ నిర్మాణ పనులు చేపట్టినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. కమిషనర్ మల్లికార్జున ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ వార్డు ప్లానింగ్ సెక్రటరీ మహేష్ సిబ్బందితో వెళ్ళి మున్సిపల్ కాల్వ పోరంబోకు స్థలం ఆక్రమణ యత్నాలను అడ్డుకున్నారు. చదునుచేసి బెడ్ కాంక్రీట్‌కు సిద్ధంగా వుంచిన కడ్డీలను వాటిని కటింగ్‌చేసే యంత్రాలను సీజ్ చేశారు. ఇప్పటికే శిల్పకల ఫంక్షన్ హాలు నిర్మాణం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించారు. ఈ అక్రమ కట్టడంపై గతంలో పని చేసిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా భారీగా ముడుపులు తీసుకొని వాటిని అనుమతించారు. ఇప్పటికి ఈ కట్టడంపై చార్జ్ షీటు కూడా వేయనట్లు సమాచారం. ఈ అక్రమ కట్టడానికి మున్సిపల్ రెవెన్యూ అధికారులు పన్ను సైతం విధించారు. ఇప్పటికైనా ఈ అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో గ్రూపు విభేదాలు

పోటా పోటీగా వైఎస్ షర్మిల జన్మదినం కార్యక్రమాలు

కడప కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు బయటపడ్డాయి. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున దాదాపు 12 డివిజన్ల నేతలు వేర్వేరుగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ పలు కార్యక్రమాలు చేపట్టారు. కడప నియోజక వర్గం సమన్వయ కమిటీ ఇన్‌చార్జి బండి జకరయ్య ఆధ్వర్యంలో నగరంలోని 5వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి హాజరయ్యారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. జిల్లా కేంద్రం, కడప నియోజక పరిధిలో జరిగే కార్యక్రమాలను తనకు తెలియకుండా చేస్తున్నారని, ఎంత వరకు కరెక్ట్ అంటూ డీసీసీ అధ్యక్షురాలి విజయజ్యోతి వాగ్వాదానికి దిగారు. తాను మూడు తరాలుగా వైఎస్ కుటుంబంతో ఉన్నానని, కడపలో జరిగే కార్యక్రమాలను తనకు తెలియకుండా నిర్వహిస్తున్నారంటూ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ వాదోపవాదాలకు దిగాడు. ఈవిషయంపై తనను అడగవద్దంటూ, చిన్న, చిన్న విషయాలను పెద్దగా చేయవద్దని విజయజ్యోతి కోపంతో కేక్ కట్ చేయకుండానే కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం అఫ్జల్ ఖాన్ బండి జకరయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు, నేతలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, కాంగ్రెస్ నేతలు పీస్ గౌస్ పీర్, శ్యామలమ్మ, విజయసుశీల్, మామిళ్ల బాబు, ప్రసాద్‌గౌడ్, కుల్లయ్య, మార్తమ్మ, సిరాజుద్దీన్ తదితర నేతలు పాల్గొన్నారు.

వైవీయూలో ఐఎస్ఓ ప్రతినిధుల బృందం పరిశీలన

నేడు మరికొన్ని విభాగాలు పరిశీలించే అవకాశం



ఫైల్స్‌ను పరిశీలిస్తున్న ఐఎస్ఓ ప్రతినిధులు - రైఫిల్ షూటింగ్‌కు సంబంధించి పరిశీలిస్తున్న ప్రతినిధి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) ప్రతినిధుల బృందం సందర్శించింది. తొలుత ప్రతినిధుల బృందం హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య, ఆడిటర్ సుమాదేవి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డిని కలిశారు. అనంతరం కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్.ఎల్.సుబ్రమణ్యశర్మ, డీడీ ఎం.సుబోస్‌చంద్ర, గ్రీన్ అండ్ ఎనర్జీ సభ్యులతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ బ్లాక్, సైన్స్ బ్లాక్, గురుకులం భవనాల్లోని డిపార్ట్‌మెంట్లను పరిశీలించారు. శాఖల్లో జరుగుతున్న ప్రగతిని ప్రత్యక్షంగా గమనించారు. నాణ్యమైన బోధన, ప్రయోగాలు, అధునాతన ప్రయోగశాలలు, పరిశోధనలు, అత్యున్నత ప్రమాణాలు కలిగిన పరిశోధన పత్రాలను వారు చూశారు. అధ్యాపకులు పొందిన పేటెంట్లు, ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి అందుకున్న అవార్డులు, వివిధ శాఖల్లో అమలు చేస్తున్న నూతన విధానాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థుల ప్రయోజనార్థం పనిచేస్తున్న పలు విభాగాలు వాటి పనితీరును మదింపుచేశారు. విద్యార్థుల మౌలిక వసతులు, పచ్చదనంతో ఉన్న విద్యాలయ పరిసరాలను ప్రత్యక్షంగా చూశారు. బుధవారం కూడా పరిశీలన ఉంటుందని డాక్టర్ సుబ్రమణ్యశర్మ తెలిపారు. ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రతిష్టాత్మక అత్యున్నత స్థాయి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మొక్కల పెంపకం ఎంతో మహోన్నతం

వీసీ ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన నేలతల్లిని స్మరించుకుంటూ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం ఎంతో మహోన్నతమైందని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనవర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య విశ్వనాథ్‌కుమార్ అన్నారు. మంగళవారం వర్సిటీలో ఆర్తి విజయ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవా పథక కార్యక్రమ అధికారులు, విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సేవా పథక అధికారులు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వరలక్ష్మి, వర్సటీ ప్రజాసంబంధాల అధికారి వి.శివకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెండ్లిమర్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెల్లటూరులో కేంద్ర గ్రామీణశాఖాభివృద్ధి మంత్రి పర్యటనపై ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద నాయక్ డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన, పంటల సాగు గురించి డ్వాక్రా మహిళలు, రైతులతో చర్చించి వడ్డెమాని శివారెడ్డి సాగుచేసిన చామంతి, మినుము, సాంబశివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి సాగుచేసిన వేరుశనగ, మామిడి డ్రిప్‌ను పరిశీలించారు. డీఆర్‌డీఏ పీడీ నీలకంఠారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఓబులేసు, ఏపీఎం బాలస్వామి, రైతులు పాల్గొన్నారు.

'ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి'

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు, మధ్యతరగతి వ్యాపారులకు ఉపయుక్తంగా ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ డిమాండ్ చేశారు. మంగళవారం యూటీఎఫ్ భవన్‌లో సేవ్ పబ్లిక్ సెక్టార్ కడప ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కరువు పీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో ఉన్న హైకోర్టు, లా యూనివర్సిటీ, ఎంఎస్ఎంఈ కేంద్రం, గతంలో అనంతపురానికి రావాల్సిన ఎయిమ్స్‌ను, ఇలాగా ఎన్నో రకాలుగా ఇక్కడి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒరవడిని ఇలా కొనసాగించవద్దని వక్తలు కోరారు. సదస్సులో అనేక సంఘాల నాయకులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

నాగాభరణం చోరీ

కొండాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మల్లేశ్వరకోనలో నాగాభరణం చోరీకి గురైంది. శివయ్యకు ధరించే నాగాభరణాన్ని సోమవారం మధ్యాహ్నం అపహరణకు గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. వెండితో తయారు చేసిన నాగాభరణం విలువ సుమారు రూ. 2 లక్షల వరకు ఉంటుంది. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. పట్టపగలే నాగాభరణం చోరీకి గురవడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

వైవీయూ పూర్వ పరిశోధక విద్యార్థి డాక్టర్ ధీరజ్‌కు ప్రశంసలు



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న ధీరజ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం పూర్వ పరిశోధక విద్యార్థి డాక్టర్.బి.వి.కె.ధీరజ్ అంతర్జాతీయ సదస్సులో ప్రశంసలు అందుకున్నారు. 13 నుంచి 15 వరకు న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్‌లోని వృద్ధులలో అభిజ్ఞా పనితీరుపై సామాజిక-జనాభా చరరాశుల పాత్ర అనే అంశంపై పరిశోధన పత్రాన్నిసమర్పించారు. ధీరజ్ పరిశోధన పత్రాన్ని సోషియో సైకలాజికల్ రంగంలో ఉత్తమమైనదిగా ఎంపిక చేసి శ్రీవేంకటేశ్వర అవార్డును అసోసియేషన్ ఆఫ్ జెరొంటాల జీ, ఇండియా అందజేసింది. అతనికి వైవీయూ సైకాలజీ శాఖ డాక్టర్ కె.లలిత మార్గదర్శకత్వం అందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

కొండాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లావనూరు-చెన్నమ నేనిపల్లె మధ్య మంగళవారం సురేష్(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వంక దగ్గర మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అనంతపురం జిల్లా యల్లనూరు వాసి బాలయ్య కుమారుడిగా పోలీసులు గుర్తించారు. వంక దగ్గర మృతదేహం పడి ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. వివిధ కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. కొండాపురం పోలీసులు యల్లనూరు చేరుకుని స్థానిక పోలీసులతో కలిసి విచారిస్తున్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు రెవెన్యూ సదస్సు

బి.కొత్తకోట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బయప్పగారిపల్లెలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ అన్సారీ పేర్కొన్నారు. రెవెన్యూ పర సమస్యలపై అర్జీలు స్వీకరించి, వాటిని ఆన్‌లైన్ చేసి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నిందితుడికి రిమాండ్

ముద్దనూరు డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): వెల్పుచర్లలో జరిగిన ఘర్షణ కేసులో నిందితుడు రాచకుంట బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

వల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈఓ ఓబులమ్మ తనిఖీ చేశారు. ఎంపీడీఓ రఘురాంతో చర్చించారు. హాజరు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వెలుగు, ఉపాధి సిబ్బందితో సమావేశమై అవగాహన, సూచనలు చేశారు.

బొలెరో దొంగ అరెస్టు

వేంపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచిన బొలెరో వాహనాన్ని దొంగలించిన షేక్ రఫి అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. బైపాస్‌రోడ్డులో ఉండగా పట్టుకుని, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బోదకొట్టం దగ్ధం



కాలిపోయిన కొట్టం

ముద్దనూరు డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొలవలి వద్ద నివాసం ఏర్పరచుకున్న యానాది కులస్తుడు దానం పెద్దలయ్య బోద కొట్టం ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. బాధితుడి సమాచారం మేరకు వివరాల్లోకెళితే... కొలవలి వద్ద కొన్నేళ్లగా యానాదులం బోధ కొట్టాలు వేసుకుని నివసిస్తున్నారు. ఇంట్లో నివారు పనులకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో కొట్టంలో నున్న టీవీఎస్ వాహనం, సామగ్రి పూర్తిగా కాలిపోయింది. తమను అధికారులు ఆదుకోవాలని పెద్దలయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణవ పీఠాధిపతి ఆధ్యాత్మిక ప్రవచనాలు

కడప కలెక్టరేట్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): త్రిభాషా సహస్రావధాని, ప్రణవ పీఠాధిపతి బ్రహ్మర్షి వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవ చనాలు చేశారు. మంగళవారం నగరంలోని అష్టలక్ష్మీ కల్యాణ మండపంలో సుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవాసమితి ఆధ్వర్యంలో దేశ భక్తి, ధర్మప్రచార విశిష్టతపై ఆధ్యాత్మిక ప్రవ చనాలు వల్లించారు. ఈకార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని 'బలం విష్ణుఃప్రవర్ధతాం, బలం గురోః ప్రవర్ధతాం' నినాదాల తో సభాస్థలి దైవ నామస్మరణంతో మార్మోగింది. సేవా సమితి అధ్యక్షుడు పరమేశ్వరరెడ్డి, గౌరవాధ్యక్షుడు రామ మూర్తి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి గిరిధర్ రెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీపీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప కలెక్టరేట్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 వతేదీ నుంచి 23 వరకు నిర్వహించనున్న ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) డిపార్ట్‌మెంట్ పరీక్షల నిర్వహణపై డీఆర్వో సమీక్షించారు. జిల్లాలో 5 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, కన్వెన్షనల్ టైప్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో ఉదయం 8-30 గంటల నుంచి 9-30 వరకు, మధ్యాహ్నం 1-30 గంటల నుంచి 2-15 గంటల వరకు మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు పరీక్ష కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేసి పరీక్షలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారన్నారు. జిల్లాలో నగర పరిధిలో ఉక్కాయపల్లెలోని శ్రీశ్రీనివాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో కేఓఆర్ఎం మెమోరియల్ కాలేజీ, ఆఫ్ ఇంజనీరింగ్, కేఎస్ఆర్ఎం కళాశాల, కేఎల్ఎం కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలు (తాడిగొట్ల)-తో పాటు ప్రొద్దుటూరు పరిధిలో- సాయ రాజేశ్వరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టక్నాలజీ బాలాజీ నగర్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ ప్రత్యేకాధికారులు అశోక్, ఖాసీం వల్లి,సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వ్యర్థాల రోత భరించలేకున్నాం

వాల్మీకిపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మొదలు మదనపల్లెకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాల దుర్వాసనలు రోత పుట్టిస్తున్నాయి. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ సమీపాన జాతీయ రహదారి పక్కగా చికెన్ వ్యర్థాల కుప్పలతో నిత్యం విద్యార్థులు సైతం ఇబ్బందులకు గురవుతుండడం గమనార్హం. మదనపల్లెకు వెళ్లే మార్గంలో నూతన సబ్ జైలు భవనాల వద్ద జాతీయ రహదారిపై ఇరువైపులా చికెన్ వ్యర్థాలను కుప్పలుగా పారబోసి వెళ్తుండడం అటుగుండా వెళ్లే వాహన చోదకులు కూడా దుర్వాసనలతో ఇబ్బందులకు గురవుతున్నారు. దుకాణల నిర్వాహకులు వ్యర్థాలను ఇష్టారాజ్యంగా రోడ్లపై పారబోయడంతో రోగాల బారిన పడుతున్నామన్నారు.

విద్యుత్ స్తంభానికి తీగపాదలు తొలగింపు



కలకడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన కలకడ నడిబొడ్డు చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనేఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభానికి ఉన్న తీగ పాదలను విద్యు త్ శాఖ అధికారులు తొలగించారు. మంగళవా రం చిత్రం చెప్పిన సమస్య శీర్షిక 'ఆంధ్రజ్యో తి'లో ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఇన్‌చార్జి ఏఈ రాజశేఖర్, లైన్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్‌వలి, లైన్‌మెన్ శ్రీనివాసులకు ఆదేశాలిచ్చి తీగ పాదలను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వాలు

ములకలచెరువు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టినట్లు టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. మండలంలోని దేవళచెరువు గ్రామ పంచాయతీలో మంగళవారం తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రా రెడ్డి ఆదేశాలతో సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకుంటే టీడీపీ కార్యకర్తగా గుర్తింపుతో పాటు రూ.5లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉత్తమ నాయుడు, శ్రీనివాసులు, సాయికుమార్, రాము, శంకర, రామచంద్ర, సిద్దప్ప, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడిని కలిసిన జనసేన నేత సాయినాథ్

ములకలచెరువు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో మంగళవారం టీటీడీ బోర్డు సభ్యుడు బురగపు ఆనందసాయిని తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ కలిశారు. ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఈ సందర్భంగా సాయినాథ్ తెలిపారు. ఆయన వెంట ఆర్ట్ డైరెక్టర్ సాహిసురేష్ ఉన్నారు.

పక్కాగృహాలకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కలకడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిబండ పంచాయితీ గొల్లపల్లెలో 40 పక్కా గృహాలకు అవసరమైన స్థలాన్ని మంగళవారం అధికారులు, నాయకులు పరిశీలించారు. ఇందు కోసం గ్రామంలోని సర్వే నెంబరు 519, 561లో భూమి గుర్తించి హద్దులు కేటాయించారు. ఈ ప్రాంతంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి గృహాలు నిర్మించనున్నట్లు మండల సర్వేయర్ దేవి, వీఆర్వో విజయ్‌కుమార్, నాయకులు ఆనంద్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, సాంబశివలు తెలిపారు.

ఈ సారైనా మండల సమావేశం జరిగేనా?

బి.కొత్తకోట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం ఈ సారైనా జరిగేనా అంటూ పలువురు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా సెప్టెంబరు 20 జరగాల్సిన మండలమీట్‌ను కూటమి నాయకులు అడ్డుకోవడంతో ఎంపీడీవో శంకరయ్య వాయిదా వేశారు. కాగా 90 రోజులలోగా మళ్లీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నందున అనుమతుల కోసం ఎంపీపీ లక్ష్మీనరసమ్మ వద్దకు పంపినా ఆమె సంతకం చేయలేదు. దీంతో తనకున్న అధికారం మేరకు 19న సమావేశం నిర్వహించడానికి పూనుకున్నారు. ఇప్పటికే రెండుసార్లు వాయి దాపడిన సమావేశం మూడవసారైనా జరుగుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈసారి కూడా మండలమీట్ సాధ్యపడక పోతే, జరిగిన విషయంపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి. దీంతో నాలుగవ సారి తేదీని ప్రకటిస్తారా? మండలపరిషత్ పాలకమండలి రద్దు అవుతుందా అనే విషయం తేలనుంది.

నేతన్నకు ప్రభుత్వం చేయూత

●వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ●నేత కార్మికులకు తగ్గిన ఆర్థిక భారం ● హామీ నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



మగ్గంనేయడానికి దారాలు అతికిస్తున్న చేనేత కార్మికురాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక చేనేతలకు చేయూత నిస్తోంది. దీం తో చేనేత రంగంపై ఆధారపడిన నేతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయం లో చేనేత రంగం అభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభు త్వం నేతన్నలకు 100లోపు యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం అమలు చేసింది. చేనేత కార్మి కులకు జీరో విద్యుత్ బిల్లులు రావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత విద్యుత్ పొంద డానికి అర్హులైన చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులకు నేతన్నలకు ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తుంపు కార్డు, ఆధార్‌కార్డు వంద యూనిట్ల లోపల వచ్చిన విద్యుత్ బిల్లు తోపాటు చేనేత కార్మికుడిగా ఉన్న ఫొటోతో కూడిన దరఖాస్తును సమీపంలోని సచివాలయం లేదా కరెంటు ఆఫీస్‌లో ఇవ్వాలి. రెండు మూడు రోజుల్లో ఆప్రాంతపు లైన్‌మెన్ విచారణ చేసి అర్హులుగా గుర్తిస్తారు. గత అక్టోబరు, నవంబరు లో దరఖాస్తు చేసుకున్నవారికి విద్యుత్ బిల్లు జీరో రావడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నీరుగట్టువారిపల్లెలో చేనేత కుటుంబా లు ఐదు వేలు వరకు ఉన్నాయి. పని చేస్తున్న మగ్గాలు ఆరువేలు, ఉచితం విద్యుత్‌కు అందించి న దరఖాస్తులు నాలుగు వేల వరకు ఉన్నాయి.

చేనేతలకు భరోసా ఇచ్చిన చంద్రబాబు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత విద్యుత్ అందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతన్నలకు భరోసా కల్పించారు. గతంలో కూడా టీడీపీ పాలనలో సబ్సిడీలతోపాటు ఆర్థిక సాయం, ఉచితంగా చేనేత కార్మికులకు బియ్యం అందించారు. చేనేత భీమా, ఆదరణ పథకాలను అమలు చేసి ఆదుకున్నారు.

-గుంపు వెంకటేష్ ,
ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు , మదనపల్లి

చేనేతలకు ఆర్థిక భారం తగ్గింది



ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీలను అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. దీంతో ప్రతి నెలా నేతన్నలకు ఆర్థిక భారం తగ్గనుంది. గత ప్రభుత్వంలో ఒక మగ్గానికి రూ.500పైగా కరెంటు బిల్లు చెల్లించేవారమని, అనేక కారణాలతో చేతినిండా పనిలేక కరెంటు బిల్లు చెల్లించడానికి ఇబ్బందులు పడేవారం, గత రెండు నెలలుగా జీరో కరెంటు బిల్లు రావడంతో ఆర్థిక భారం కొంచెం తగ్గింది.

-ముష్టూరి రామమోహన్ ,
చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు , మదనపల్లి

ఎస్సీ, ఎస్టీ కేసును విచారణ చేసిన డీఎస్పీ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డు జరిగిన ఇరువర్గాల దాడిలో ఎస్సీ, ఎస్టీ కేసును మంగళవారం విచారణ చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే ఈనెల 7వ తేదీన మదనపల్లెకు చెందిన జయభరత్(39)ను మరొక వర్గంకు చెందిన రెడ్డిశేఖర్, మధుబాబు, మునీంద్రనాయక్‌లు కలిసి కొట్టారు. ఇరువర్గాలు భూ వివాదంలో గొడవపడ్డారు. జయభరత్ ఈ నెల 13న వన్‌టౌన్ ఫిర్యాదు చేయగా ఆ మేరకు వన్‌టౌన్ ఎస్ఐ శివకుమార్ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారణ నిమిత్యం మంగళవారం మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు బెంగళూరు రోడ్డుకు వచ్చి చుట్టుపక్కల వారిని కేసుపై విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

ముగ్గురు కోడిపందెం రాయుళ్ల అరెస్టు

● రెండు కోళ్లు, రూ.7840 నగదు స్వాధీనం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):కోడిపందెం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక వీవర్స్ కాలనీలో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే పోలీసులు దాడులు నిర్వహించి రెండు కోళ్లను, రూ.7,840 నగదు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మేడికుర్తి వైద్యాధికారికి గాయాలు

కలికిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. డాక్టర్ చిన్నరెడ్డెప్ప నడుపుతున్న కారు మేడికుర్తి సమీపంలోని పారపట్ల వద్ద మంగళవారం ఉదయం ప్రమాదానికి గురై బోల్తా పడింది. వాల్మీకిపురం నుంచి చాకిరేవుపల్లె మార్గంలో విధులకు హాజరయ్యేందుకు తన కారులో మేడికుర్తి వస్తుండగా పారపట్ల సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కంకర కుప్ప మీదకు ఎక్కిన కారు బోల్తా కొట్టింది. కారు నడుపుతున్న డాక్టర్ చిన్నరెడ్డెప్ప స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తగిన చికిత్స తీసుకున్న అనంతరం ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



గురువు దంపతులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):కంభంవారిపల్లె మండలం, చీనేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు అపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా అప్పడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు నిత్యానందరెడ్డిని మంగళవారం మదనపల్లె రెడ్డీస్ కాలనీలోని ఆయన నివాసంలో కలిసి పూలమాలతో దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం గురువు ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వవిద్యార్థులు నాగభూషణనాయుడు, కిశోర్, శ్రీనివాసులు,పెంచులయ్య, నాగరాజ, శివశంకర్, నాగిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పాడిపశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పశువులకు మందులు అందచేస్తున్న పశువైద్యశాఖ అధికారులు

తంబళ్లపల్లె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాడిపశువులకు సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుగణాభివృద్ధి సంస్థ ఈవో, డీఎల్‌డీఏ డాక్టర్ బాల సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం కన్నెమడుగు పశువైద్యశాల పరిధిలోని మర్రిమాకులపల్లెలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 55 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేశారు. పశువులకు చూడి పరిక్షలు, కట్టునిలవని పశువులకు చికిత్సలు నిర్వహించి మందులు ఉచితంగా అందచేశారు. అనంతరం పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేసి పశువులకు పిడుదుల నివారణ మందు పిచికారి చేశారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యశాల సహాయ సంచాలకులు సుమిత్ర, పశువైద్యులు సుజనశ్రీ, విక్రమ్, ఉస్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రామసముద్రం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 5 రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని దిగువపేట(ఓసీ), హరిజనవాడ(ఎస్సీ మహిళ), చెంబకూరు 1బీసీఏ, చెంబకూరు 2 (ఓసీ మహిళ), చింపరపల్లె ఓసీకి కేటియించినట్లు ఆయన చెప్పారు. దరఖాస్తుదారులు ఇంటర్ అర్హత కలిగి ఉండి, 18నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఈనెల 21తేదీ సాయంత్రం 5గంటలలోగా అర్హులైన అభ్యర్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు 28వ తేదీన రాతపరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఈనెల 30, 31 తేదీల్లో ముఖాముఖి నిర్వహించి డీలర్ల నియామకం చేపడతామని ఎంపీడీవో తెలిపారు.

కిశోరి బాలికల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహరరాజు

వాల్మీకిపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సమాజంలో కిశోరి బాలికల పట్ల కుటుంబ సభ్యులతో పాటుగా సంబంధిత అంగన్వాడీ అధికారులు కూడా బాధ్యత తీసుకోవాలని వాల్మీకిపురం ఎంపీడీవో మనోహర్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాల ద్వారా కలిగే నష్టాలు, బాలింతల పట్ల శ్రద్ధ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో భారతి, హెల్త్ ఎడ్యుకేటర్ మొహ్మద్ రఫీ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘననివాళి



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద బలిజ సేవాసమితి నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):స్థానిక పుంగనూరు రోడ్డులో వై. జంక్షన్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేసి ఏడాది గడిచిన సందర్భంగా బలిజసేవా సమితి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వైఎస్ మునిరత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ రేగడి ప్రసాద్‌కుమార్, జనసేన నాయకులు శ్రీరామరామాంజయులు, ఉపాధ్యక్షుడు గుండాల రామచంద్ర, గౌరవాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మీ, బీవీ రమణ, సుంకర రామచంద్ర, బండిబాలాజీ, రెడ్డిశ్రీనివాసులు, పసుపులేటి వరప్రసాద్, కిరణ్‌కుమార్, చంటి పాల్గొన్నారు.

రాజ్యసభ ఎంపీ కృష్ణయ్యకు సన్మానం



ఎంపీ కృష్ణయ్యను సన్మానిస్తున్న జబ్బల

మదనపల్లె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెండోసారి రాజ్యసభ ఎంపీగా బాధ్యతలు చేపట్టిన ఆర్.కృష్ణయ్యను కురబసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఢిల్లీలోని ఆయన నివాసంలో కృష్ణయ్యను జబ్బల కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. కృష్ణయ్య భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

సమాజ సేవకుడికి డాక్టరేట్ ప్రదానం



భానుప్రకాష్‌కు డాక్టరేట్ అందిస్తున్న డాక్టర్స్ రాయ్ ఫెర్‌నాండో, ప్రొఫెసర్ విజయకుమార్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణానికి చెందిన వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాకుడు గుంపు భానుప్రకాష్‌కు సమాజ సేవలను గుర్తించి తమిళనాడుకు చెందిన కామన్ వెల్త్ పీస్ యూనివర్సిటీ వారు అమెరికన్ ఆనర్‌బుల్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తమిళనాడులోని కామన్ వెల్త్ యూని వర్సిటీలో ఆ యూనిర్సిటీ షాన్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్, చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రాయ్ ఫెర్‌నాండో ఆధ్వర్యంలో మదనపల్లెకు చెందిన భానుప్రకాష్‌కు డాక్టరేట్‌ను అందించారు. ఈసందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ ఈ డాక్టరేట్ రావడం చాలా ఆనందంగా ఉంది. దీంతో నాకు సమాజంలో సేవలు చేసే బాధ్యతను పెంచిందన్నారు. అనంతరం మదనపల్లెలోని సభ్యులు ఆ ఫౌండేషన్ వ్యవస్థాకుడు గుంపు భానుప్రకాష్ ను దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించగా తోటి సభ్యులు అభినందించారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

పీలేరు/కలికిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలిరెడ్డి సోమశేఖర రెడ్డి ఆధ్వర్యంలో పీలేరులోని శ్రీ లక్ష్మీ వృద్ధాశ్రమం, కలికిరిలోని సర్వోదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు దుబ్బా శ్రీకాంత్, లోకేశ్, గణేశ్, సందీప్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 17 :(ఆంధ్రజ్యోతి) కోర్టులో వెలసిన గంగమ్మకు మంగళవారం ఆలయకమిటీ ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు సుష్మిత్ పుష్పాలతో అలంకరణ చేసి అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):మదనపల్లెకు చెందిన వన్‌డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి నెల్లూరు డిపోలోని ఆర్టీసీ ఉద్యోగులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు డ్రైవర్లకు మంచి అలవాట్లు ఉండాలన్నారు.సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. ఆర్టీసీ బస్సులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మనదపల్లె వన్‌డిపో ప్రతినెలా రీజియన్స్‌లోనే అన్ని సెగ్మెంట్లలో ప్రథమ స్థానం సాధిస్తోందన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్యే



బీకేపల్లెలో రజకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు పట్టాలిప్పిస్తామని కొంత మంది దళారులు అమాయకులను మోసం చేస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీకేపల్లె రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంత మంది డీకేటీ భూములను ఆక్రమించుకుని అక్రమంగా విక్రయిస్తున్నారని, వారి మీద ల్యాండ్ గ్రాబింగ్ కేసులకు సిఫారసు చేస్తామన్నారు. డీకేటీ భూములు విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరమని గుర్తు చేశారు. అర్హులైన వారు నేరుగా దరఖాస్తు చేసుకుంటే ఎన్టీఆర్ గృహనిర్మాణం పథకం కింద రెండు సెంట్ల ఇళ్ల స్థలాలతో పాటు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3.80లక్షలు ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీకేపల్లె అభివృద్ధి విస్మరించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో సీసీరోడ్లు వేయించి అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు.

బీకేపల్లెలో ఎకరా స్థలంలో దోబీఘాట్

మదనపల్లె పట్టణానికి ఉత్తరం వైపున ఉన్న రజకుల అవసరానికి బీకేపల్లెలో ఎకరా స్థలంలో దోబీఘాట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీకేపల్లె కాలనీలో పర్యటించిన ఆయన టీడీపీ నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు నాగయ్య, రజక సంఘం నాయకుల కోరిక మేరకు దోబీఘాట్‌కు స్థలం సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ స్థల సేకరణ పూర్తి కాగానే బోరు తవ్వించి, ప్రభుత్వ ఖర్చులతో దోబీఘాట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మల్లికార్జున, రజక సంఘం నాయకులు రామ్మూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

భూ సమస్యలు, ఇంటిపట్టాలపై 35 అర్జీలు



కాకులారంపల్లెలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నఅధికారులు

పీలేరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు, ఇళ్ల పట్టాల కోసం అధికారులకు 35 అర్జీలు అందాయి. భూసమస్యలపై 30, ఇంటి స్థలాలు కావాలంటూ 5 అర్జీలు అందినట్లు తహసీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వాటిని పరిష్కరిస్తామని ఆయన అర్జీదారులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి రమ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, టీడీపీ నేతలు చిన్న రెడ్డప్ప రెడ్డి, పుట్టా రాజశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేత బీడు భూమిని కాపాడండి

కలకడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):కలకడ మండలం గంగాపురం గ్రామంలో వందల ఎకరాలు మేత బీడు భూమిని అక్రమార్కుల నుంచి కాపాడాలని డీటీ భార్గవికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామంలోని సర్వే నెంబరు 769(కోయిల్‌గుట్ట ప్రాంతంలో) విస్తీర్ణం 110 ఎకరాల్లో పశువులు, గొర్రెలు, మేక మేతకు ఉపయోగపడే భూమి ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. అయితే గతంలో ఇక్కడ పని చేసిన రెవెన్యూ అధికారులు తప్పిదంతో కొందరు అక్రమార్కులు ఈ ప్రాంతంలో సుమారు 30 నుంచి 40 ఎకరాలు పట్టాలు పొందినట్లు తెలిపారు. అంతటితో ఆగక తమ పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఇది కాక గ్రామంలో రెవెన్యూ రికార్డుల కంటే ఆన్‌లైన్‌లో సుమారు 800 ఎకరాల భూమి విస్తీర్ణం అధికంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని డీటీకి వివరించారు. దీని వలన తరతరాల వారసత్వం అన్ని రికార్డులున్న తమ భూములు ఆన్‌లైన్ కాక నిజమైన హక్కుదారులమైన తాము అన్యాయానికి గురైనట్లు వాపోయారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని రైతులు కోరారు.

గుర్రంకొండలో: రైతులు తమ భూముల రికార్డులోని తప్పులను సరిదిద్దుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని చిట్టిబోయినపల్లె గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ రికార్డులు తప్పుగా ఉంటే రెవెన్యూ సదస్సులో సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందాలన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మీపతి, ఎంపీడీవో వెంకటేశులు, వీఆర్వోలు సదాశివ, భరత్, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినోత్సవం



మదనపల్లె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో అఖిల భారత విశ్రాంత ఉద్యోగులు, జీఆర్ టీస్కూల్‌లో ఆంధ్రాపెన్షనర్స్ పార్టీ సంఘం నాయకులు వేర్వే రుగా నిర్వహించారు. ఎన్‌జీవో హోమ్‌లో ఆ సంఘం అధ్యక్షుడు బి.టి.నరసింహులు అధ్యక్షతన, జీఆర్‌టీస్కూల్‌లో ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్.ముని గోపాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు మునిరత్నయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు మాట్లాడుతూ పెన్షన్ అనేది భిక్ష కాదని, అది హక్కుగా సుప్రీంకోర్టు చెప్పిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం సీనియర్స్ పెన్షనర్స్‌ను ఘనంగా సన్మానించారు. పెన్షనర్స్ పితామహుడు డీఎస్‌నఖారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాచారపల్లెకు చెందిన సీనియర్స్ పెన్షనర్స్ పులగంటి పెద్దరెడ్డెప్ప, పులగంటి చిన్నరెడ్డెప్పలను ఘనంగా సన్మానించారు. ఎన్‌జీవో హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌జీవోసంఘం ఉపాధ్యక్షుడు రెడ్డిశేఖర్, కార్యదర్శి ఎ.శ్రీనివాసులు, బి.నరేష్, బి.వి.రమణ, కె.నరసింహు లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్‌జీవోహోమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రాపెన్షనర్స్‌అధ్యక్షుడు శ్రీనివాసులు, తిమ్మయ్య, శకుంతలమ్మ, జగన్‌మోహన్, కృష్ణమూర్తి, ద్వారకనాథ్‌రెడ్డి, ధనలక్ష్మి, సరస్వతమ్మ, ప్రొఫెసర్ శ్రీనివాసులు, గొల్లపూడి తిరుపతిరావు, కరుణాకర్, ఉస్మాన్‌సాహెబ్, కుమారస్వామి, మక్‌బుల్‌బాషా, ద్వారక నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




సహచరులను సన్మానించిన పెన్షనర్ల సంఘ సభ్యులు

పీలేరులో: పీలేరులో మంగళవారం పీలేరు మండల విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండులోని కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్ నేతృత్వంలో 70 ఏళ్లు నిండిన పెన్షనర్లు గోపాల్ నాయుడు, భాస్కరన్, రామయ్య, వెంకటరామయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా మహబూబ్ మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన వివిధ ఆర్థిక ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసి యేషన్ నాయకులు జీపీ రాజు, చంద్రయ్య, రవణప్ప, రెడ్డప్ప పాల్గొన్నారు.

'మానవత' సంస్థకు రూ.5 వేలు విరాళం

పీలేరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తన మనవరాలు ఎనిమిదవ జన్మదినం సందర్భంగా పీలేరుకు చెందిన దివంగత రిటైర్డు హెచ్ఎం గోపతి మునిరత్నయ్య సతీమణి రాజేశ్వరి మానవత సంస్థకు రూ.5 వేల విరాళం అందజేశారు. తన విరాళాన్ని మంగళవారం ఆమె మానవత సంస్థ నిర్వాహకులు వంగిమళ్ల రామచంద్ర, శెట్టి సుబ్రహ్మణ్యం, సురేశ్ కుమార్‌లకు అందించారు.

విద్యుత్ పొదుపుతో భవితకు భరోసా



విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో త్యాగరాజు, విద్యుత్ అధికారులు

తంబళ్లపల్లె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపు చేసి భావితరాలకు భరోసా కల్పిద్దామని,ఎంఈవో త్యాగరాజు పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా ఏఈ శేషకుమార్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, కేజీబీవీలలో విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన ప్రాముఖ్యతతో పాటు విద్యుత్‌ను ఏ విధంగా పొదుపు చేయాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. ఎంఈవో మాట్లాడు తూ..విద్యుత్ పొదుపుపై ప్రతి ఒక్క రూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాల న్నారు. ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేయడం వల్ల రెండు యూనిట్లు ఉత్పత్తి భారం తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అవసరం లేని సమయంలో స్విచ్‌లు ఆఫ్ చేసి విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, నాగరాజు లైన్‌మెన్లు శంకర, నాగేంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.